విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 329 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 21 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# ఆకలితో ఎవ్వరూ బాధపడకూడదు...

- అందుకే 269 అన్న క్యాంటీన్లు ఏర్పాటు
- దేశానికే అన్నం పెట్టిన రాష్ట్రం మనది
- భువనేశ్వరి రూ.76 లక్షల విరాళం అందజేశారు
- ఇదే స్ఫూర్తితో అందరూ ముందుకు రావాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

- మిగతా2లో





## రాష్ట్ర విభజన తర్వాత 20,801 కారుణ్య నియామకాలా?

- ఒకే కుటుంబం నుంచి మూడో తరానికి చెందిన వారున్నారు
- 'సుప్రీం' తీర్పునకు అనుగుణంగా 'కారుణ్యం'పై మార్గదర్శకాలు రూపొందించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- నిరుద్యోగుల ఆశలను మొగ్గలోనే తుంచేస్తున్నారని వ్యాఖ్య

రాష్ట్ర విభజన(2014 జూన్ 2) జరిగాక వివిధ ప్రభుత్వశాఖలు, కార్పొరేషన్లలో 20,801 కారుణ్య నియామకాలు జరగడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. వీరిలో కొంతమంది ఒకే కుటుంబం నుంచి మూడో తరానికి

- మిగతా2లో

# డబులింజన్‌తో ప్రగతిపథం

**ఎన్టీఆర్, ఎంజీఆర్ మధ్య మంచి స్నేహం ఉండటంతో అప్పట్లో తెలుగుగంగను ప్రారంభించి తమిళనాడుకు నీరిచ్చారు. తమిళనాడుకు శ్రీరామరక్షగా గంగ- కావేరి నదుల అనుసంధానం చేయాలనే లక్ష్యంతో మోదీ ఉన్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా ఏపీలోని నదుల అనుసంధానం తర్వాత తమిళనాడుకు నీరివ్వాలని ఆయన తపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు విజయవంతంగా పూర్తిచేసి, తమిళనాడుకూ నీళ్లిస్తాం.**

- అభివృద్ధి కావాలంటే ఎన్డీయేకు ఓటేయండి
- ఏపీనే నిదర్శనం
- కేంద్రం నిధులిచ్చినా ఇక్కడి ప్రభుత్వం తీసుకోవట్లేదు
- మహిళా బిల్లుకు మోకాలొడ్డి డీఎంకే ఏం సాధించింది?
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం రావడంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. డబులింజిన్ సర్కారు ఫలితం ఎలా ఉంటుందో తమ రాష్ట్రాన్ని చూసి తెలుసుకోవచ్చున్నారు. మీకూ అలాంటి అభివృద్ధి కావాలంటే ఎన్డీయేను గెలిపించాలని తమిళనాడు ఓటర్లకు పిలుపునిచ్చారు. చంద్రబాబు సోమవారం తమిళనాడులోని కోయంబత్తూర్, కృష్ణగిరి జిల్లా తళి, చెన్నై అన్నానగర్ నియోజకవర్గాల్లో ఎన్డీయే

- మిగతా2లో

# పవన్ కల్యాణ్ ఆరోగ్యం కోసం మృత్యుంజయ హోమం

- చాలాకాలంగా పవన్ కల్యాణ్ కు అనారోగ్య సమస్యలు
- శనివారం నాడు హైదరాబాదులో శస్త్రచికిత్స జరిగిన వైనం
- పవన్ కల్యాణ్ కోసం మృత్యుంజయ హోమం
- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఈ నెల 21న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో హోమం

- మిగతా2లో



# సీఎంతో నార్వే రాయబారి భేటీ

నార్వే రాయబారి మే-ఎలిన్ స్టెనర్ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనను నార్వే రాయబారి తన బృందంతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆమెకు జ్ఞాపికను అందజేశారు. అనంతరం తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలను, ఇక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. సమావేశంలో సీఎస్ కె.రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు





## అమెరికా నుంచి రూ.15 లక్షల కోట్లు వెనక్కి

### మొదలైన ట్రంప్ టారిఫ్ రిఫండ్ ప్రక్రియ

అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, ట్రంప్ టారిఫ్ రిఫండ్ ప్రక్రియ సోమవారం మొదలైంది. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద రిఫండ్ ఇది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లు రాజ్యాంగ విరుద్ధమైనవని, తిరిగి ఇచ్చేయాలని ఆదేశిస్తూ ఆ దేశ సుప్రీం కోర్టు ఫిబ్రవరి 20న ఇచ్చిన తీర్పు ఇందుకు నేపథ్యం.ఎంత మందికి రావొచ్చు..: యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో టారిఫ్ రిఫండ్ ప్రక్రియ సోమవారం

- మిగతా2లో



# చర్చలపై హైడ్రామా

- నేడు జరుగుతాయో లేదో తెలియని సందిగ్ధత
- పాక్‌కు వాన్స్ బయలుదేరారన్న ట్రంప్
- సంప్రదింపుల ప్రణాళికలేవీ లేవన్న ఇరాన్
- హర్మూజ్ సమీపంలో టెహ్రాన్ నౌకపై అమెరికా దాడి
- రేపటితో ముగియనున్న కాల్పుల విరమణ గడువు
- ఒప్పందం కుదరకుంటే బాంబుల వర్షమే: ట్రంప్

వాషింగ్టన్, టెహ్రాన్: అమెరికా–ఇరాన్ మధ్య రెండో విడత చర్చలపై తీవ్ర సందిగ్ధత కొనసాగుతోంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా మంగళవారం ఈ సంప్రదింపులు జరుగుతాయో లేదో స్పష్టంగా తెలియరాలేదు. చర్చలు ఉంటాయని అమెరికా

- మిగతా2లో

# జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే పెద్ద దస్తగిరి హత్య

- తన సన్నిహితుడు నిత్యానందరెడ్డికి అడ్డుగా ఉన్నాడనే ఘాతుకం
- రాజకీయ లబ్ధి కోసం సొంత కార్యకర్తనే బలితీసుకున్నారు
- వివేకా మొదలు.. ఈ హత్య వరకూ తాడేపల్లి ప్యాలెస్‌లోనే పథక రచన
- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం



వైకాపా అధినేత జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే ఆ పార్టీ నాయకుడు, స్థిరాస్తి వ్యాపారి పెద్ద దస్తగిరి హత్య జరిగిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య మొదలు.. ఈ హత్య వరకూ తాడేపల్లి ప్యాలెస్‌లోనే పథక రచన జరిగిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం సొంత బాబాయ్‌నే కాదు, పార్టీ కార్యకర్తల్ని కూడా ఆయన బలి తీసుకుంటున్నారని మండిపడ్డారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డికి పెద్ద దస్తగిరి అడ్డుగా ఉన్నారనే ఈ ఘాతుకానికి ఒడిగట్టారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రామానాయుడు సోమవారం విలేకరులతో మాట్లాడారు. "అధికారం, ఆస్తులు, డబ్బు కోసం ఎంతకైనా తెగించే విష సంస్కృతి జగన్‌ది, ఆయన పార్టీది. ఆయన గొడ్డలి పోటు క్షేత్రస్థాయి కార్యకర్త వరకూ పాకింది. నిత్యానందరెడ్డికి సంబంధించిన రూ.వంద కోట్ల రియల్ ఎస్టేట్ లావాదేవీలకు అడ్డుగా ఉన్నాడనే పెద్ద దస్తగిరిని అంతమొందించారు. వివేకానందరెడ్డి హత్యలో గొడ్డలి వేటును గుండెపోటుగా చిత్రీకరించి సాక్ష్యాల్ని తారుమారు చేసినట్టే.. పెద్ద దస్తగిరి హత్యలోనూ చేస్తున్నారు. ఈ కేసులో నిందితులు హత్యానంతరం నేరుగా వెళ్లి నిత్యానందరెడ్డిని కలవడం చూస్తేనే దీని వెనుక ఎవరున్నారో అర్థమవుతుంది" అని రామానాయుడు దుయ్యబట్టారు.

కార్యకర్త ప్రాణం కంటే పైసాకే ఎక్కువ విలువ: వైకాపాలో

- మిగతా2లో



# మనది అయోధ్య బంధం

దక్షిణ కొరియా అధ్యక్షుడితో ప్రధాని మోదీ

దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో భేటీ అయ్యారు. అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాల గురించి మాట్లాడుతూ, ఓ సుందరమైన ప్రేమ కథనూ ప్రస్తావించారు. అయోధ్య యువరాణి సురిరత్న, కొరియా రాజు కిమ్ సురోల మధ్య రెండు వేల ఏళ్ల క్రితం ఉదయించిన ప్రేమ, పరిణయం గురించి

- మిగతా2లో

# మహిళా బిల్లును చంపింది మోదీయే

- మేం వ్యతిరేకించింది డీలిమిటేషన్ బిల్లును మాత్రమే
- సార్వత్రిక ఎన్నికలను ముందుకు జరపాలని ప్రధాని ప్రయత్నం
- బెంగాల్‌కు మోదీ సీఎం అవుతారేమో.. ఇక్కడే తిష్ఠ వేశారు: ఖర్గే

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) బిల్లునే విపక్షం వ్యతిరేకించిందని, ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం మహిళా రిజర్వేషన్ బిల్లును చంపేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుల్ని వ్యతిరేకించడం ద్వారా విపక్షం 'భ్రూణహత్య'కు పాల్పడిందని ప్రధాని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. మహిళా కోటాను తాము వ్యతిరేకించలేదని, విపక్షాల పోరాటమంతా డీ లిమిటేషన్ బిల్లుపైనే అని స్పష్టంచేశారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని కూచ్ బిహార్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మహిళా కోటా పేరుతో డీ లిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసేందుకు భాజపా ప్రయత్నించి, చివరకు విఫలమైందని ఎద్దేవా చేశారు. వీగిపోయింది ముమ్మాటికీ ఆ బిల్లేనని

- మిగతా2లో



# ఆకలితో ఎవ్వరూ బాధపడకూడదు...

"రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూ డదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశాం. ఇటీవలే 62 కొత్తగా ప్రారంభించాం. మరో ఐదు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఒకప్పుడు దేశానికే అన్నంపెట్టిన అన్నపూర్ణ మన రాష్ట్రం. అందుకే.. అన్నం ఎవరికీ దొరకలేదు అనేమాట లేకుండా.. ప్రతి ఒక్కరికీ కడుపు నింపాలనే ఉద్దేశంతోనే అన్న క్యాంటీన్లు పెడుతున్నాం. నా పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్ల ఒకరోజు నిర్వహణకు రూ.76 లక్షల విరాళాన్ని భువనేశ్వరి అందించినందుకు.. ఆమెను అభినందిస్తున్నాను. ఇదే స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకుని ముందుకొచ్చి.. అన్నక్యాంటీన్ల నిర్వహణకు సహకారం అందించాలి. ప్రభుత్వం ఇక్కడ అన్నం పెట్టలేక కాదు.. అన్న క్యాంటీన్లను ఒక స్ఫూర్తికి వేదికగా మార్చేందుకు అవకాశం ఉన్నవాళ్లంతా స్వచ్ఛందంగా ముందుకురావాలి. అన్నదానంలో భాగస్వాములు కావాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పుట్టినరోజు సందర్భంగా విజయవాడలోని పటమట అన్న క్యాంటీన్‌కు భార్య భువనేశ్వరితో కలిసి

వచ్చిన ముఖ్యమంత్రి ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్న క్యాంటీన్లు సైతం పీ-4లో ఒక భాగంగా ఉన్నాయని తెలిపారు. ఈరోజు అన్న క్యాంటీన్‌లో పేదల ఆనందం స్వయంగా వచ్చి చూశాక.. చాలా సంతృప్తి కలిగిందని వెల్లడించారు. ఏదైనా అన్న క్యాంటీన్‌లో ఒకపూట, ఒక రోజు లేదంటే శక్తి ఉంటే మొత్తం రాష్ట్రమంతా అన్నం పెట్టేందుకు సహకారం అందించవచ్చన్నారు. ఎవరినీ బలవంతం చేయడం లేదనీ, అందరం కలిసి స్ఫూర్తిగా నిలవాలన్నదే తమ లక్ష్యమన్నారు. భోజనం పెడతామంటే కేసులు పెట్టారు..

వైకాపా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను సైతం మూసేసిందని చంద్రబాబు గుర్తుచేశారు. "పేదలకు అన్నం పెడుతుంటే సహించలేక క్యాంటీన్లను మూసేయడానికి.. వారికి మనసెలా వచ్చిందో.. అర్థం కావడం లేదు. కొందరు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పేదలకు భోజనం పెడతామంటే.. వారిపైనా తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారు. వారి ఆలోచనా విధానానికి ఇది నిదర్శనం. పేదలు కడుపునిండా అన్నం తిన్నా.. భరించలేనివాళ్లు రాజకీయాల్లో ఉన్నారు. అలాంటి వాళ్లకు రాష్ట్రాన్ని పాలించే అవకాశం ఇచ్చారంటే.. ప్రజలే ఆలోచించుకోవాలి" అని చంద్రబాబు సూచించారు.

# డబులింజన్‌తో ప్రగతిపథం

-మొదటిపేజీ తరువాయి

తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోయంబత్తూర్‌లో వివిధ రంగాలకు చెందిన తెలుగువారు, నిపుణులతో భేటీ అయ్యారు. ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ 'ఏపీలో 2019లో మేం ఓడిపోతే ఓ పార్టీ వచ్చి ఐదేళ్లు విధ్వంస పాలన చేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌ను కాపాడేందుకు పవన్ కల్యాణ్‌తో కలిసి రాజకీయంగా ముందుకెళ్లాం. మేమిద్దరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి ఏపీలో ప్రగతిని కొత్తపుంతలు తొక్కిస్తున్నాం. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయంటే అది డబులింజిన్ సర్కారు విజయమే. ఏపీలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో తయారు చేయబోతున్నాం. అమరావతిలో 5వేల ఎకరాలతో కొత్త విమానాశ్రయాన్ని నిర్మించబోతున్నాం' అని వివరించారు.

**కాంగ్రెస్, డీఎంకే కూటమిని నిలదీయండి**

మహిళా బిల్లు, లోక్‌సభ స్థానాల పునర్విభజనను వ్యతిరేకించి కాంగ్రెస్, డీఎంకే, మిత్రపక్షాలు పెద్ద తప్పు చేశాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వీగిపోయేలా చేసి ఢిల్లీని, మోదీని ఓడించామని డీఎంకే విర్రవీగుతోందని.. దాంతో వారేం సాధించారని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న 130 సీట్లు 50 శాతం పెరిగి 195కు చేరేవని.. కేవలం రాజకీయ ఎజెండాతో కాంగ్రెస్, డీఎంకే, మిత్రపక్షాలు వ్యతిరేకించాయని ధ్వజమెత్తారు. 2026-27 జనాభా లెక్కలతో పునర్విభజన చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారని, దానివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. 'వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు 1991 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 1971 జనాభా సంఖ్యను ఫ్రీజ్ చేసి రిజర్వేషన్లు చేయాలని నేను డిమాండ్ చేశాను. అలా చేస్తే ఏ రాష్ట్రానికీ నష్టం జరగదన్నాను. అప్పట్లో కాంగ్రెస్ సహకరించలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాజ్యసభలో బిల్లులు పెట్టినా లోక్‌సభలో వారి మిత్రపక్షాల నుంచే వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుతం కొత్త సవరణ ద్వారా ప్రతి రాష్ట్రం 50 శాతం సీట్లు పెరిగేలా, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వచ్చేలా చేయాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం దూరదృష్టితో చేసింది' అని వివరించారు. 'ఇలాంటి బిల్లుల్ని వ్యతిరేకించి ఎందుకు తప్పు చేశారని ఓటర్లు కాంగ్రెస్, డీఎంకే కూటమిని ప్రశ్నించాలి. ఇది తమిళనాడు నుంచే మొదలవ్వాలి. సంస్కరణలతో దేశాన్ని నంబర్‌వన్‌గా చేసిన మోదీకి మద్దతు తెలపాలి. సంస్కరణల వ్యతిరేక పార్టీల్ని ఓడించాలి' అని పిలుపునిచ్చారు.

**అవినీతి, అప్పుల భారమేనా మీ గొప్ప?**

'విమానాశ్రయాలతో ఉద్యోగాల కల్పన ఉంటుంది. కానీ చెన్నైలో విమానాశ్రయం అభివృద్ధి చెందలేదు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల నిర్మాణంలో స్టాలిన్ సర్కారు విఫలమైంది. కేంద్రం తమిళనాడుకు సహకరించినా.. డీఎంకే సరిగా వాడుకోలేదు. అవినీతి, శాంతిభద్రతల సమస్య, డ్రగ్స్, ప్రజలపై అప్పుల భారం తప్ప డీఎంకే ఏం సాధించింది? ఇక్కడ మహిళలపై 59 శాతం, ఎస్సీలపై 39 శాతం నేరాలు పెరిగాయి. ఒక్కో మద్యం సీసాపై రూ.10 అదనంగా వసూలు చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. మరోవైపు హిందూ ధర్మాన్ని ఎగతాళి చేస్తున్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్నాదురై డీఎంకే పెడితే ఇప్పుడు స్టాలిన్ అదే కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పనిచేస్తున్నారు. శ్రీలంకలో తమిళుల కష్టాలకు కాంగ్రెస్, డీఎంకేనే కారణం' అని విమర్శించారు. తమిళనాడులో కేంద్ర ప్రభుత్వమే 4,000 కి.మీ. రహదారులు నిర్మించిందని గుర్తు చేశారు.

'గతంలో జయలలిత కోసం కోయంబత్తూర్‌కు వచ్చి ఎన్నికల ప్రచారం చేశా. తర్వాత ముఖ్యమంత్రిగా ఆమె ప్రమాణస్వీకారానికి వచ్చా. ఇప్పుడు కూడా గెలిచేది ఎన్డీయేనే. ఈ ఎన్నికలు టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు పరీక్షలాంటివి' అని చంద్రబాబు చెప్పారు.

సభల్లో ఎన్డీయే శ్రేణుల నుంచి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

'మీకు అభివృద్ధి కావాలా, ఉద్యోగావకాశాలు కావాలా, అలాగైతే కేంద్రంలో మోదీ ఉండాలి, రాష్ట్రంలో జయలలిత పాలన రావాలి. అందుకోసం ఎన్డీయేను గెలిపించండి' అంటూ చంద్రబాబు తమిళంలో మాట్లాడి శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

# రాష్ట్ర విభజన తర్వాత 20,801 కారుణ్య నియామకాలా?

-మొదటిపేజీ తరువాయి

చెందినవారు ఉన్నారని పేర్కొంది. కారుణ్య నియామకం విషయంలో మరణించిన ఉద్యోగి కుటుంబం ఆర్థికంగా బలంగా ఉందా లేదా అనే విషయాన్ని ప్రధానంగా చూడాలని సూచించింది. ఆ కుటుంబం ఆర్థిక వనరులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలకన్నా తక్కువగా ఉంటే వారికి ఉద్యోగానికి బదులు ఎక్స్‌గ్రేషియా (పరిహారం) చెల్లించాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా కారుణ్య నియామకాలకు సంబంధించి నూతన మార్గదర్శకాలు మూడు నెలల్లో రూపొందించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. మృతిచెందిన ఉద్యోగిపై ఆధారపడిన వారి ఆర్థిక సామర్థ్యం, కారుణ్య నియామకానికి బదులుగా ఇచ్చే ఎక్స్‌గ్రేషియా, పొరుగుసేవలు/ తాత్కాలిక/ ఒప్పంద ప్రాతిపదికన ఉపాధి కల్పన వంటి అంశాలను మార్గదర్శకాల్లో స్పష్టంగా నిర్వచించాలని చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. తీర్పు ప్రతిని సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకురానున్న కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించాలన్నారు.

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లికి చెందిన పెంచలయ్య గ్రంథాలయ సహాయకారిగా పనిచేస్తూ చనిపోయారు. వివాహితురాలైన ఆయన కుమార్తె సుజన తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు తదితర విభాగాల్లో ఎంతమందిని కారుణ్యం ద్వారా నియమించారో చెప్పాలని సాధారణ పరిపాలన శాఖను న్యాయమూర్తి అడిగారు. ప్రత్యేక సీఎస్ వివరాలు సమర్పిస్తూ రాష్ట్ర విభజన తర్వాత కారుణ్యం కింద 20,801 మంది ఉద్యోగాలు పొందారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. "కారుణ్యం కింద జరుగుతున్న నియామకాలు సంఖ్య భారీగా ఉంది. 20,801 మందిని నియమించడమంటే.. కారుణ్యం పేరు చెప్పి 'మినహాయింపు' ఇవ్వడమనేది సర్వసాధారణమైనట్లు కనిపిస్తోంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఉద్యోగి కుటుంబ సభ్యులను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు కారుణ్య నియామకం చేస్తారు. రాష్ట్ర విభజన తర్వాత ఏడాదికి దాదాపు 2 వేల కారుణ్య నియామకాలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా జరిపే నియామకాలతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఇవి ఉన్నాయి. ఎందరో విద్యావంతులైన యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తుంటే.. విచక్షణారహిత కారుణ్య నియామకాలతో రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు నిరుద్యోగ యువత ఆశలను మొగ్గలోనే తుంచివేస్తున్నాయి. మృతిచెందిన ఉద్యోగి కుటుంబ సభ్యులపై అతికారుణ్యం చూపుతూ నిరుద్యోగ యువతిపై దయలేకుండా వ్యవహరిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు.

**ఇబ్బందులెదుర్కొనే కుటుంబాలు లక్షల్లో**

"ప్రభుత్వ ఉద్యోగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే నిబంధన నుంచి కారుణ్య నియామకానికి 'మినహాయింపు' ఉందన్న కారణంతో.. ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు పొందే యువత ప్రాథమిక హక్కును ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు ఉల్లంఘిస్తున్నాయి. కొన్ని కుటుంబాల్లో ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ ఉద్యోగమూ లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడే నిరుద్యోగ యువత ఉన్నారు. కారుణ్య నియామకం కోరే వారికి మాదిరిగా.. తమ కష్టాలను చెప్పుకోవడానికి నిరుద్యోగులకు వేదిక లేదు. ఉద్యోగి మరణంతో ఆ కుటుంబసభ్యులు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందుల కంటే అధిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. కారుణ్య నియామకానికి కేవలం అర్హతనే చూస్తారు తప్ప, వారి పనితీరు, సామర్థ్యాన్ని పరీక్షించే విధానం ఉండదు. సానుభూతిని అడ్డంపెట్టుకొని ఈ నియామక ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నట్లుంది" అని న్యాయమూర్తి ఆక్షేపించారు.

**విచక్షణాధికారం ప్రభుత్వానికే**

"ఉద్యోగి మరణించడానికి ముందు ఆయన ఆదాయంపై ఆధారపడి ఎవరు జీవిస్తారో.. వారే కారుణ్య నియామకానికి అర్హులు. ఆ ప్రకారం భార్య, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులు మాత్రమే దానికి అర్హులు. ఈ నిర్వచనం కాలక్రమేణా మృతుడి సోదరులు, అక్కాచెల్లెళ్లు, మేనల్లుళ్లు, మేనకోడళ్లకు విస్తరించింది. ఈ నేపథ్యంలో ఆధారపడిన వాళ్లు ఎవరో తేల్చేందుకు కఠిన నిబంధనలు రూపొందించాలి. ఎక్స్‌గ్రేషియా చెల్లింపులోనూ 2017లో జారీచేసిన జీవో 114... చాన్నాళ్లుగా పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా లేదు. ఈ నేపథ్యంలో మరణించిన ఉద్యోగి చివరి జీతం, మిగిలి ఉన్న సర్వీసు కాలాన్ని పరిగణనలోకి తీసుకొని ఎక్స్‌గ్రేషియా సొమ్మును నిర్ణయించాలి. ఒకవేళ కుటుంబంలోని అర్హులకు ఉద్యోగం ఇవ్వడం తప్పనిసరి అయితే... శాశ్వత ఉద్యోగిగా నియమించడానికి బదులు పొరుగు సేవల ఉద్యోగిగా నిర్దిష్ట కాలానికి నియమించాలి. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే కారుణ్య నియామకాన్ని శాశ్వత ప్రాతిపదికన చేపట్టవచ్చు. ఈ వ్యవహారంలో విచక్షణాధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి విడిచిపెడుతున్నాం" అని జస్టిస్ ఎన్.విజయ్ తీర్పు చెప్పారు.

# చర్చలపై హైడ్రామా

-మొదటిపేజీ తరువాయి

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలపగా.. సంబంధిత ప్రణాళికలేవీ తమకు లేవని చెబుతూ ఇరాన్ గట్టి షాకిచ్చింది! హర్మూజ్ సమీపంలో టెహ్రాన్ నౌకపై వాషింగ్టన్ బలగాలు దాడి చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. పాక్ మాత్రం చర్చలు జరుగుతాయన్న ధీమాతో కనిపిస్తోంది. అమెరికా, ఇరాన్ ప్రతినిధులకు ఆతిథ్యమివ్వడం కోసం ఇస్లామాబాద్‌లో అది పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది. సంప్రదింపులకు వచ్చే అవకాశాలను ఇరాన్ పూర్తిగా కొట్టేయకపోవడం, చర్చలకు అది సుముఖంగానే ఉందని పాక్ అధికారులు చెబుతుండటం కొంత ఊరట కలిగించే విషయం. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనుంది. దాన్ని పొడిగించే అవకాశాలు లేవని, శాంతి ఒప్పందం కుదరకుంటే ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తామని ట్రంప్ హెచ్చరించారు.

**ట్రంప్‌నకు మునీర్ ఫోన్**

ఇరాన్‌తో చర్చల కోసం తమ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం సోమవారమే పాక్‌కు చేరుకుంటుందని ట్రంప్ ఆదివారం తెలిపారు. అయితే సోమవారం రాత్రి వరకూ వారు ఇస్లామాబాద్ చేరుకోలేదు. వాన్స్ పాక్‌కు బయలుదేరారని ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ట్రంప్ పేర్కొన్నారు. కానీ ఆయన ఎక్కడున్నారో చెప్పేందుకు అమెరికా అధికార వర్గాలు నిరాకరించడం గమనార్హం. మరోవైపు- ట్రంప్‌తో పాక్ సైన్యాధిపతి అసీం మునీర్ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఓడరేవుల దిగ్బంధనంపై కోపంతోనే చర్చలకు ఇరాన్ మీనమేషాలు లెక్కిస్తోందని ట్రంప్‌నకు ఆయన తెలిపారని సమాచారం.

**యుద్ధానికి రమ్మని ఇజ్రాయెల్ కోరలేదు: ట్రంప్**

ఇజ్రాయెలే తనను యుద్ధంలోకి లాగిందంటూ సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న విమర్శలపై ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో యుద్ధానికి దిగాలని ఆ దేశం తననెప్పుడూ కోరలేదని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌లో అక్టోబరు 7 (2023)న జరిగిన మారణహోమాన్ని చూశాక.. ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వస్త్రాలు దక్కకుండా చేయాలని తాను మరింత బలంగా తీర్మానించుకున్నట్లు 'ట్రూత్ సోషల్'లో తెలిపారు. టెహ్రాన్‌తో ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం గడువును పొడిగించే అవకాశాలు లేవన్నారు.

**ఇంకా నిర్ణయించుకోలేదు: ఇరాన్**

అమెరికాతో తదుపరి రౌండ్ చర్చల్లో పాల్గొనే ప్రణాళికలు ప్రస్తుతానికి తమకు లేవని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ సోమవారం విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సంప్రదింపులపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

# పవన్ కల్యాణ్ ఆరోగ్యం కోసం మృత్యుంజయ హోమం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నారు. జనసేన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమం జరగనుంది. (ఏప్రిల్ 21) మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవిలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.ఈ హోమానికి అవనిగడ్డ నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, మెగా అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## మహిళా బిల్లును చంపింది మోదీయే

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. "నియోజకవర్గాల పునర్విభజనను ముందుకు జరిపి దేశంలో సార్వత్రిక ఎన్నికలను ముందుగానే నిర్వహించాలని మోదీ భావిస్తున్నారు. మీరు (మోదీ) ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు పొడిచారు. మహిళా సాధికారతకు పాటుపడుతున్నట్లు చెప్పుకొంటున్నారు. మహిళా హక్కులు, వారి సంక్షేమం మాకెంతో ప్రాధాన్య అంశం. 2010లోనే రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును యూపీఏ సర్కారు ఆమోదించింది. మోదీ సర్కారు 30 నెలలుగా దానిపై నిద్రపోయి.. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ముందు మేల్కొంది. సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ వంటి మహిళా నేతలు మా పార్టీవారే. భాజపా ఒక్కసారైనా మహిళకు అధ్యక్ష పదవిని ఇచ్చిందా?" అని ప్రశ్నించారు.

**అధికారిక విధుల్ని విస్మరించి బెంగాల్లోనే ఉంటారా?**

చాలా రోజులుగా మోదీ బెంగాల్లో నలుమూలలా తిరుగుతూ తన అధికారిక విధుల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. ఆయన ప్రధానిగా కొనసాగదలచుకున్నారా, లేదంటే బెంగాల్‌కు సీఎం అవుదామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మోదీ చేస్తున్న ఎన్నికల ప్రచారం వల్ల శాంతికి విఘాతం కలిగి, సమాజంలోని భిన్న విశ్వాసాలవారి మధ్య ఉద్రిక్తత తలెత్తుతోందని చెప్పారు. ఇలాంటి ఎత్తుజిత్తులకు ఇంకెక్కడైనా ఫలితం ఉంటుందేమో గానీ బెంగాల్ ప్రజలు మాత్రం పడిపోరని పేర్కొన్నారు. బెంగాల్లో కాంగ్రెస్ పార్టీ కొన్ని పార్టీలతో ఎన్నికల పొత్తులు పెట్టుకుని చాలా నష్టపోయిందని చెప్పారు.

**మోదీ ప్రిజర్వేషన్: కాంగ్రెస్**

దిల్లీ: మహిళలకు రిజర్వేషన్ కల్పించడం కేంద్రం ఉద్దేశం కాదని, ప్రధాని నరేంద్రమోదీ 'ప్రిజర్వేషన్' (పరిరక్షించుకునే) ప్రయత్నమని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగా మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఆ మేరకు బిల్లు తీసుకురావాలని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విజ్ఞప్తి చేశారు. కులగణనను మరుగున పడేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. భాజపా ప్రచారంతో మహిళలు మోసపోయేది లేదని చెప్పారు.

## అమెరికా నుంచి రూ.15 లక్షల కోట్లు వెనక్కి

-మొదటిపేజీ తరువాయి

ఉదయం 8 గంటలకు మొదలైంది. ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను తెరచారు. 5.3 కోట్ల సరఫరాలకు సంబంధించి 3.3 లక్షల మందికి పైగా దిగుమతిదార్లు టారిఫ్ రూపేణ 166 బి.డాలర్లు (సుమారు రూ.15.44 లక్షల కోట్లు) చెల్లించారు. వీరందరికీ తక్షణం రిఫండ్ అందదు. అయితే ఏప్రిల్ 14 నాటికి 56,497 సంస్థలు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని, రిఫండ్ ఫైలింగ్‌కు అర్హత సాధించినట్లు తెలుస్తోంది. కంపెనీలు కొత్త కేప్ (కన్సాలిడేటెడ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రాసెసింగ్ ఆఫ్ ఎంట్రీస్) వ్యవస్థ ద్వారా షిప్‌మెంట్, టారిఫ్ చెల్లింపులను ఫైల్ చేయాల్సి ఉంటుంది. వీటికి అనుమతి లభిస్తే వడ్డీ సహా 60-90 రోజుల్లోగా రిఫండ్ లభించొచ్చని అంచనా. వినియోగదార్లకు లభిస్తాయా?: ఆయా ఉత్పత్తులపై విధించిన టారిఫ్‌లను దిగుమతిదార్లు చెల్లించారు. వారు ఆ వస్తువులను విక్రయించినప్పుడు, వినియోగదార్లకు అధిక ధరల రూపంలో వాటిని బదలాయించి ఉంటారు. ప్రస్తుత రిఫండ్ వ్యవస్థ కింద ఆ మొత్తాన్ని వారికి పంచాల్సిన అవసరం లేదు. కంపెనీలు మాత్రం స్వచ్ఛందంగా తమకు అందే రిఫండ్‌ను వినియోగదార్లకు ఇవ్వదలచాయి. ఫెడెక్స్ వంటి డెలివరీ దిగ్గజాలు, రిఫండ్ వచ్చిన వెంటనే వినియోగదార్లకు బదిలీ చేస్తామంటున్నాయి

## మనది అయోధ్య బంధం

-మొదటిపేజీ తరువాయి

చెబుతూ.. దక్షిణ కొరియాతో బంధం ఈనాటిది కాదని అన్నారు.

భారత ప్రభుత్వ వెబ్‌సైట్ 'ఇంక్రెడిబుల్ ఇండియా'లో కూడా ఈ ప్రేమ కథ గురించి వివరంగా ఉంది. అయోధ్య యువరాణి సురిరత్నను.. కొరియాలో రాణి హేయో హాంగ్-ఓక్ అని పిలుస్తారు. 2021లో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్హే నగరం కలిపి ఆ రాణి స్మారక చిహ్నాన్ని సరయూ నది తీరంలో నిర్మించాయి.

కొరియాలోని 'సంగుక్ యుసా' అనే పురాతన గ్రంథం ప్రకారం.. దాదాపు రెండు వేల ఏళ్ల క్రితం అయోధ్య యువరాణి సురిరత్న, సముద్ర ప్రయాణం చేసి కొరియా చేరుకుని, అక్కడ రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు.

కొరియాకు చెందిన కారక్ వంశీయులు ఇప్పటికీ తమను ఈ రాణి వారసులుగానే భావిస్తారు. అందుకే ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో కొరియన్లు అయోధ్యలోని సరయూ నది తీరాన ఉన్న ఆమె స్మారక చిహ్నాన్ని సందర్శిస్తుంటారు.

సోమవారం అధినేతలు లీ జే మ్యుంగ్, మోదీ చర్చల అనంతరం పారిశ్రామిక సహకారం, ఉక్కు సరఫరా గొలుసు తదితర రంగాల్లో ఇరు దేశాలు 15 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.ద్వైపాక్షిక వాణిజ్య విలువను 2030 కల్లా 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్ణయించాయి.

## జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే పెద్ద దస్తగిరి హత్య

-మొదటిపేజీ తరువాయి

కార్యకర్త ప్రాణం కంటే పైసాకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారని మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు. "గతంలో జగన్ కాన్వాయ్ కింద సొంత కార్యకర్త నలిగి చనిపోతుంటే.. చక్రాల కింద నిమ్మకాయను తొక్కించినట్టు అతడిపై నుంచి వాహనాన్ని నడిపించారు. ఆ శవాన్ని పొదల్లోకి విసిరేయించిన మానవత్వం లేని మనిషి జగన్‌రెడ్డి. తల్లి, చెల్లి, బాబాయ్, కార్యకర్త ఇలా ఎవరైనా జగన్‌కు ఒక వస్తువు మాత్రమే. అడ్డొస్తే ఎవరినైనా తొలగించే గొడ్డలి సంస్కృతి ఆయనది. వైకాపా కార్యకర్తలు ఈ విషయాన్ని గుర్తించాలి. మిమ్మల్ని తన ధనదాహం తీర్చుకోవడానికి జగన్ వాడుకుంటారు. అవసరం తీరాక పెద్ద దస్తగిరి లాగే గాలికొదిలేస్తారు. మీ ఆస్తులు, ప్రాణాల్ని బలితీసుకుంటారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఆయన మారలేదు. 'చంపేస్తాం, నరికేస్తాం, అంతుచూస్తాం' అని తప్ప ఆ పార్టీ నేతల నుంచి నిర్మాణాత్మకమైన మాట ఒక్కటీ రావడం లేదు" అని నిమ్మల అన్నారు.

**ప్రతి దందాలోనూ తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా**

వైకాపా నాయకులు చేసే ప్రతి కబ్జా, దందా, సెటిల్‌మెంట్‌లోనూ తాడేపల్లి ప్యాలెస్‌కు వాటా వెళుతుందని నిమ్మల పేర్కొన్నారు. ఇది నిజమో, కాదో జగన్ చెప్పాలన్నారు. "జగన్‌ది పక్కా క్రిమినల్ మైండ్. ఆయన ఆదేశాలతో రాష్ట్రంలో జరుగుతున్న హత్యాయత్నాలు, దాడులే ఇందుకు నిదర్శనం. గొడ్డలి సంస్కృతికి వైకాపా కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడం, అభివృద్ధి పనుల్ని అడ్డుకోవడం, రప్పా రప్పా అంటూ ప్రజల్ని బెదిరించడమే జగన్ పనిగా పెట్టుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ముష్టికుంట్ల రైతుల ఆందోళన -- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం కోసం రోడ్డుపై బైఠాయింపు



**మధిర పెన్ సత్తా :**బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన రైతులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతులు మాట్లాడుతూ, ఈ సీజన్‌లో పెద్ద ఎత్తున మొక్కజొన్న పంట పండించినప్పటికీ, సరైన కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకు పంటను కొనుగోలు చేస్తుండటంతో నష్టాలు చవిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కజొన్నను దూర ప్రాంతాలకు తరలించాల్సి రావడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి మరింత నష్టపోతున్నామని రైతులు పేర్కొన్నారు. అందుకే తమ గ్రామంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించడంతో రాకపోకలకు అంతరాయం... కలిగింది.

## దౌర్జన్యంగా 8 ఎకరాలకు ఉన్న చుట్టూ ప్రహరీ కడియలను, పైపులైను,డ్రిప్పు, ఫిల్టర్ సిస్టంను, పగులకొట్టిదాడి చేసినారు.

- వెంటనే చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు అధికారులకు విన్నపం.
- కొమ్మిడి రాంరెడ్డి తండ్రి సత్తిరెడ్డి పులిగిల్ల గ్రామం.







వలిగొండ మండలం పెన్ సత్తా ఏప్రిల్ **20.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో ఉన్న పులిగిల్ల గ్రామానికి చెందిన కొమ్మిడి రాంరెడ్డి సన్నాఫ్ సత్తిరెడ్డి, మీడియా ద్వారా మాట్లాడుతూ నేను గతంలో 8 ఎకరాలు భూమి సర్వే నెంబరు 131 మరియు 111 మరియు 112 లో ఉన్న భూమిని మార్కెట్ దరకు కొన్నను,పెద్దల సమక్షంలో ఎనిమిది ఎకరాలు అమ్మినవారికి పూర్తిగా డబ్బులు చెల్లించి నేను నా పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను, దాంట్లో తోట ఏర్పాటు చేసుకున్నాను, నిన్న రాత్రి గ్రామంలోని కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేసి తోట చుట్టూ ఉన్న కడీలను , తోటలో ఉన్న, పైపు లైను పగలగొట్టి, డ్రిప్పు సిస్టము పగలగొట్టి, 200 కడీలు విరగొట్టడం జరిగింది,గతంలో కూడా నాపై దౌర్జన్యం చేసినారు, పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టినాను,పెద్దల సమక్షంలో నిన్న పంచాయతీ మాట్లాడదామన్నారు, నా తరపున పెద్దలు, వాళ్ళ తరపున గ్రామ పెద్దలు, కూర్చున్నారు కానీ ఏమీ మాట్లాడలేదు, రాత్రి ఇలా ఫోటో పైన దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసం, నేను అక్కడ ఉంటే నన్ను చంపేవారు,నాకు ప్రాణభయం, ఉన్నది నన్ను కాపాడాలి జిల్లా కలెక్టర్ కు, ఎమ్మార్వో కు వలిగొండ ఎస్ఐకి విన్నవించుకుంటున్నాను, పరిశీలించి దర్యాప్తు చేసి నాకు న్యాయం చేయాలని మీడియా ద్వారా కోరుతూ కొమ్మిడి రామ్ రెడ్డి తండ్రి పేరు సత్తిరెడ్డి, మాట్లాడినారు. అనుమానం ఉన్న కొందరి పేర్లను కూడా ఆయన మీడియా ద్వారా తెలిపినారు,

## నాగిలిగొండ లోసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ.

**చింతకాని పెన్ సత్తా ప్రతినిధి.**ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన నాగిలిగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ

మండల పరిధిలో నీ నాగిలిగొండ గ్రామంలో షిఎతీట చెక్కులను పంపిణీ చేసిన గ్రామ పార్టీ అధ్యక్షుడు పగడాల రాధాకృష్ణ గ్రామ మాజీ సర్పంచ్ జమ్ముల కృష్ణారెడ్డి మరియు పంది మురళీకృష్ణ వార్డ్ నెంబర్లు పామర్తి రామకృష్ణ చాట్ల నాగరాజు,గడ్డం రామారావు కిసాన్ సెల్ అధ్యక్షుడు మద్దినేని లక్ష్మయ్య, కొనకంచి నరసింహారావు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్క గా సిఫార్సు మేరకు వివిధ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం నాగిలిగొండ గ్రామానికి చెందిన ఆరుగురికి 2 లక్షల 47,500 రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైనవి లబ్ధిదారుల వివరాలు.

1) గండు రోశయ్య 60 వేల రూపాయలు
2) ఏపూరి లక్ష్మి 60 వేల రూపాయలు
3) పులి వెంకటేశ్వర్లు 42,500
4) జమ్మల సురేందర్ రెడ్డి 37,500
5) ఆదూరి పుల్లయ్య 25 000
6) కనగంటి సైదులు 22,500

నిరుపేద కుటుంబాలైన వీరు తరపున ప్రత్యేక మంజూరు చేపించిన ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క కి లబ్ధిదారులు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసినారు
.

# జిల్లా స్థాయి కర్రసాము పోటీల్లో 'జీనియస్ కిడ్స్' సత్తా

- 7 పతకాలు కైవసం చేసుకున్న జీనియస్ కిడ్స్ విద్యార్థులు.
- 18 పాయింట్లతో మండలానికి ద్వితీయ స్థానం.
- 13 పాయింట్లు జీనియస్ కిడ్స్ విద్యార్థులవే.



**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఏప్రిల్ 21:** మునగపాక మండలం తిమ్మరాజుపేట లోని డా విన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా ఈ నెల 18 న జరిగిన '4 వ జిల్లా స్థాయి కర్ర సాము ఏ కత్తి సాము ఛాంపియన్‌షిప్-2026'లో అచ్యుతాపురం మండలానికి చెందిన జీనియస్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.

కర్ర సాము ఏ కత్తి సాము మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అచ్యుతాపురం మండలం మొత్తం 18 పాయింట్లు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇందులో జీనియస్ కిడ్స్ పాఠశాల విద్యార్థులే ఏకంగా 13 పాయింట్లు సాధించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

బంగారు పతకాల విజేతలు: చార్విక, ప్రయాగ్ కృష్ణ. 2, రజత పతకాల విజేతలు కీర్తి శ్రీ, తమిళ్ ఇనియన్.

3, కాంస్య పతకాల విజేతలు గీతాన్షి, యశాంష్, చాతుర్య లు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాల ఆవరణలో విజేతలకు అభినందన సభ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై. గంగా భవాని విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగా భవాని మాట్లాడుతూ అంతరించిపోతున్న మన పురాతన కళల్లో మా పిల్లలు రాణించడం గర్వంగా ఉందన్నారు. వీరి విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుంది అని అన్నారు. కర్ర సాము ఏ కత్తి సాము మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ చీఫ్ కోచ్ మొల్లి తులసి రావు మాట్లాడుతూ కర్రసాము, కత్తిసాము వంటి పురాతన యుద్ధ కళలను బతికించేందుకు పిల్లల్లో ఇలాంటి ఉత్సాహం అవసరం. ఈ కళలతో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది అని తెలిపారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఒకేషనల్ కోర్స్ తో ఉద్యోగ ఉపాధి అవకాశాలు




**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 20:** ఒకేషనల్ కోర్స్ తో ఉద్యోగ ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అన్నారు. మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల లో 2025 -26 లో 10వ తరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులకు ఓకేషల్ కోర్సు లో భాగంగా ఎలక్ట్రికల్ అండ్ హార్డువేర్ , ఆటోమోటివ్, రిటైల్ విభాగాల్లో ఇంటర్న్ షిప్ కార్యక్రమంలో భాగంగా 10 రోజులపాటు 80 గంటలు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సోమవారం కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్, టీ షర్ట్స్ ఆ ట్రేడ్ కి సంబంధించిన టూల్ కిట్స్ ను వేంపాడు మాజీ సర్పంచ్ నూకరత్నం చేతుల మీదుగా అందజేశారు. 10 రోజులపాటు వేంపాడు పరిసరాలలో గల వ్యాపార సముదాయాల్లో ఆయా విభాగాల్లో నైపుణ్యం పెంచుకున్నారు. ఈ ఓకేషల్ కోర్స్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు ముందు తరగతులకు ఉపయోగపడుతుందని ఉద్యోగ ఉపాధి అవకాశాలు త్వరగా వస్తాయని హెచ్ఎం వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులైన డి రాజు, ఎలక్ట్రానిక్స్ ఉపాధ్యాయులు

పి.గంగాధర్ , ఆటోమోటివ్ శిక్షకులు విజయ్ కృప, మహేశ్వరి ,మోహన రావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


# వేంపాడు కొత్తూరు లో వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట





**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 20:**మండలంలో వేంపాడు కొత్తూరు లో గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్య స్వామి వారి దేవాలయం సోమవారం ప్రారంభించారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి పండగ జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, వైస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు ,రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు,పొడగట్ల పాపారావు,వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు వీసం నానాజీ, సర్పంచ్ లు ఎంపీటీసీ లు నాయకులు స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# నక్కపల్లి తహశీల్దార్ని సత్కరించిన కూటమి నాయకులు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 20:** నక్కపల్లి తహసీల్దార్ గా ఇటీవల బదిలీపై వచ్చిన నూతన తహసిల్దార్ చిన్ని కృష్ణ ను సోమవారం కూటమి నాయకులు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో ఘనం గా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో పేదలకు సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఉపమాక గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు 50 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో

మండల తెలుగుదేశం అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కురందాసు నూకరాజు, నక్కపల్లి పి ఎ సి ఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, జంపన శ్రీనివాసరాజు, టీడీపీ జనరల్ సెక్రెటరీ ప్రగడ వీరబాబు, అమలాపురం మాజీ సర్పంచ్ శంకరరావు, యలమంచిలి బుజ్జి, గుద్దటి సత్యనారాయణ, గొర్ల రవి,ఎలమంచి రమణబాబు, నరిసే దయానంద్, కొప్పిశెట్టి వాసు, ఎలమంచిలి జోగారావు, గొర్స సురేష్, గొర్స కుమార్, గోకులపాటి కనక, గోకులపాటి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్...




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా సింగరేణి వ్యాప్తముగా 11 ఏరియాలలో ప్రతీ ఏడాది నిర్వహించే సమ్మర్ క్యాంప్ లలో భాగముగా ఈ ఏడాది కూడా సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యం లో 2026-27 సంవత్సరంకు గాను 18 సంవత్సరాల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు (బాలురు బాలికలకు) కొత్తగూడెం పరిసర ప్రాంతాల పిల్లలకు ఈ నెల 27 వ తారీఖు నుండి 21 మే 2026 వరకు అనుబవజ్ఞులైన శిక్షకులచే సమ్మర్ కోచింగ్ నిర్వహించబడునని, ఆసక్తి కలిగిన పిల్లలు (బాలురు బాలికలు) 27 ఏప్రిల్ 2025, సోమవారం ప్రకాశం స్టేడియం నందు ప్రారంభం అయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్ కి హాజరు అయి తమ పేర్లను నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ పత్రికా ప్రకటన లో భాగముగా తెలిపారు. ఈ క్రింద తెలిపిన సమయాలలో తేదీ: 27 ఏప్రిల్ 2026 నుండి 21 మే.2026 వరకు ఆయా వేదికలలో జరుగునని తెలియజేయ డమయినది. క్రమ సంఖ్య క్రీడ స్థలశీ ఉదయం సమయం సాయంత్రం సమయం అథ్లెటిక్స్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం5.30 గం - 7.00 గం,బాస్కెట్ బాల్ సిఈఆర్ క్లబ్, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం,బాక్సింగ్/కరాటే ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం,ఫుట్ బాల్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం,వాలీబాల్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం ,ప్రకాశం స్టేడియం, కొత్తగూడెశీ 6.00 గం - 8.00గం 5.30 గం - 7.00 గం,డ్రాయింగ్ సింగరేణి హై స్కూల్ , కొత్తగూడెం 7.00 గం - 8.30గం ( ఉదయం మాత్రమే) పైన తెలిపిన ఆటలలో ఆసక్తి గల ఉద్యోగుల పిల్లలు ఆయా వేదికలలో, పైన తెలిపిన తేదీలు సమయాలలో పాల్గొని, క్రీడలలో నైపుణ్యం సంపాధించి ఈ వేసవి సెలవులను సద్వినియోగ పరచుకోవలసినది గా కొరడమైనది.

# రోడ్డు విస్తరణ పూర్తి చేయాలి..

- బాధితులకు న్యాయం చేయాలి






పెన్ సత్తా వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో ఏడాది కాలంగా ఆగిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని, విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పెబ్బేరు సుభాష్ చౌక్లో నిరహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వనపర్తి వెళ్లే దారిలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూ లేదా ప్లాటు కేటాయించి రూ. 5లక్షల నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. వనపర్తి వెళ్లే రోడ్డులో అసంపూర్తిగా ఉన్న రహదారి విస్తరణ పనులు వెంటనే షురూ చేయాలని, ముందుగా డ్రైనేజీ నిర్మింఇ రోడ్డు వేయాలని చెప్పారు. అదేవిధంగా రోడ్డుకు రెండు వైపులా 40 ఫీట్ల వేర రహదారి నిర్మాణం చేపట్టాలని ఎక్కడా కూడా ఎక్కువ, తక్కువలు లేకుండా చూడాలని కోరారు. అంతేకాకుండా పెబ్బేరు సుభాష్ చౌక్, అంబేద్కర్ చౌక్ల వద్ద మహిళలకు, పురుషులకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ప్రదానంగా డిమాండు చేశారు. తమ డిమాండ్లు నెరవేరేంత వరకు రోజూ దీక్షలు కొనసాగుతామని వారు చెప్పారు. దీక్షకు ఎంఐఎం మండల అధ్యక్షుడు ఆఫ్రోజ్, బీఎస్పీ నేత ఏబీజే సత్యం సాగర్, సీపీఐ నేత పెద్ద ఖాజా, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వి. శ్రీధర్ రెడ్డివెంకట్రావ్ జీ, వెంకటేష్, హన్మంతు రెడ్డి, శ్యామ్లాల్, చాకలి రాముడు, సీతమ్మ, నరేందర్ జీ, మోహన్లాల్, నర్సింహ గౌడ్, శ్రీనాథ్, రఫీ, తదితరులు దీక్షలో కూర్చున్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే.

- రైతుకు మద్దతు ధర కల్పించడమే ప్రధాన లక్ష్యం.
- దళారుల ఉచ్చులో పడి రైతులు ఆర్థికంగా నష్టపోవద్దు.
- కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
- నాణ్యతా ప్రమాణాలు పాటించి గిట్టుబాటు ధర పొందాలి.
- రైతు సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తా.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా ,ఏప్రిల్ **20,**మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రధాన లక్ష్యమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలపరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎవరణలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర కల్పించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో రెండు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. నియోజకవర్గంలోని రైతుల ఇబ్బందులను గమనించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ కేంద్రాలను మంజూరు చేయించామని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా తూకం, నగదు చెల్లింపుల విషయంలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గ రైతాంగానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తహసీల్దార్ శిరీష, ఆర్ఐ కృష్ణ, హరీష్, సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, స్థానికులు రాంబాబు, లక్ష్మణ్, కళ్యాణి, పాషా, తహసీల్దార్, చింటూ, నూనావత్ గోవిందు, మిర్యాల రాము, ప్రసాద్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి.

- ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాదు నుండి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా పూర్తయిందని, తెలంగాణలో కూడా అదే స్థాయిలో పురోగతి సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆర్వోలు తమ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు), సూపర్వైజర్లకు స్పష్టమైన దిశానిర్దేశం అందిస్తూ క్షేత్రస్థాయిలో పనులను క్రమబద్ధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకం పై ఇప్పటికే ఆయా పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున, వారి సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓలతో సమన్వయం పెంచుకుని మ్యాపింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకు ముందుకు రావడం ద్వారా మిగిలిన ప్రాంతాల్లో పనులను వేగంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్



నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, ఇతర జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల్లో మ్యాపింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బిఎల్ఓలు, సూపర్వైజర్ల సమన్వయంతో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, వారం రోజుల్లో గణనీయమైన పురోగతి సాధించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందజేస్తామని తెలిపారు .

ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డిఓ మధు, ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు మహాసభలకు తరలిరండి.......!

- ఈనెల 23న జరిగే ప్రారంభ సభను విజయవంతం చేయాలిలిశ్రీ
- సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా ఈనెల 23, 24, 25 తేదీలలో కొత్తగూడెం పట్టణంలో జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల సందర్భంగా 23 వ తారీఖున జరిగే ప్రారంభ సభకు వేలాదిగా తరలి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 11, 14 వార్డు కమిటీల ఆధ్వర్యంలో రైతు మహాసభల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటి సారిగా రైతు సంఘం రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు రైతు సంఘం అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు అశోక్ దావలె విజ్జు కృష్ణన్ తోపాటు ప్రధాన నాయకత్వం పాల్గొంటున్నారని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చిస్తారని అన్నారు. భవిష్యత్తులో రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించబోయే పోరాటాలను రూపొందిస్తారని నర్సారెడ్డి స్పష్టం చేశారు. మోడీ తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆల్ ఇండియా కిసాన్ మహాసభ నిర్ణయాత్మక పాత్ర పోషించిందని మహాత్ర ఉద్యమం తర్వాత జరిగే రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో జరగటం ప్రత్యేకమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈ మహాసభల విజయవంతని కై పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని నర్సారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు పారిల్లి సంతోష్ కుమార్ సభ్యులు పుణ్యవతి గణపతి అమ్మ సావిత్రమ్మ స్వరూప శివకుమారి తడికల కుమారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి.



- ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా ,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాదు నుండి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా పూర్తయిందని, తెలంగాణలో కూడా అదే స్థాయిలో పురోగతి సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆర్వోలు తమ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు), సూపర్వైజర్లకు స్పష్టమైన దిశానిర్దేశం అందిస్తూ క్షేత్రస్థాయిలో పనులను క్రమబద్ధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకంపై ఇప్పటికే ఆయా పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున, వారి సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓలతో సమన్వయం పెంచుకుని మ్యాపింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకు ముందుకు రావడం ద్వారా మిగిలిన ప్రాంతాల్లో పనులను వేగంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను దమ్మపేట తాసిల్దార్ కార్యాలయం నుండి ఐటీడీఏ పీవో మరియు తాసిల్దారులు, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు (ట + వీ = జు X జా) లోనే నాణ్యమైన విద్య: న్యాయవాది మొహీద్ పటేల్.



**నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి. పెన్ సత్తా** మైనారిటీ విద్యార్థులకు తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ (టీ జీ ఎం ఆర్ ఈ ఐ ఎస్) పాఠశాలలు, కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షుడు, న్యాయవాది మొహీద్ పటేల్ అన్నారు.

సోమవారం నారాయణఖేడ్‌లోని టీజీఎంఆర్ఈఐఎస్ బాలుర శాఖ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మొహీద్ పటేల్‌ను కలిసి (టీ జీ ఎం ఆర్ ఈ ఐ ఎస్) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్య వ్యక్తి అభివృద్ధికి, సమాజ పురోగతికి కీలకమని పేర్కొన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మైనారిటీ విద్యార్థులు 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్ కోర్సుల్లో (టీ జీ ఎం ఆర్ ఈ ఐ ఎస్) పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, వసతి, ఇతర సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను (టీ జీ ఎం ఆర్ ఈ ఐ ఎస్) లో చేర్పించాలని ఆయన కోరారు.

# భారతరత్న డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్ఫూర్తితో రైతు- అన్నదానం

- సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే రైతు సమస్యలపై పోరాడుతాం
- టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెన్ సత్తా** తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే రైతుల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ సంస్థ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని తెలిపారు.సంస్థ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 20వ విడత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతరత్న అవార్డు గ్రహీత హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్ఫూర్తితో రైతు- అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. గత 20 వారాలుగా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే రైతులకు కార్మికులకు అన్నదానం అందిస్తున్నామని పేర్కొన్నారు.. తాము నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా తమ సంస్థకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఇంద్రపాల సత్యనారాయణ, దావత్ అరుణ్ కుమార్, అంబాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# సమాజ సేవ చేసిన ఎస్సీ, ఎస్టీ మహనీయులకు బిజెపి సన్మానం

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ముగింపు వారోత్సవాల సందర్భంగా
- బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి.




**కొత్తగూడెం పెన్ సత్తా** :భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 135వ అంబేద్కర్ జయంతి ముగింపు వారోత్సవాల్లో భాగంగా సేవా దృక్పథం కలిగిన ప్రముఖ ఎస్టి, ఎస్సి మహనీయులకు జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం లక్ష్మీదేవి పల్లి లోని బిజెపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సదరు సేవ దృక్పథం కలిగిన మహనీయులకు సత్కారం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మారావు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని వివిధ మండలాల నుంచి విచ్చేసిన ఎస్టి, ఎస్సి కుల సంఘు నాయకులకు, విద్యావేత్తలకు, సంఘసంస్కర్తలకు, తెలంగాణ దళిత ఉద్యమకారులకు, ఎన్జీవోస్ కి, సామాజిక సేవ నాయకులకి, దళిత మహిళ నాయకురాళ్ళకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశాన్ని నిలబెట్టినగొప్ప మేధావి, సంఘసంస్కర్త అంబేద్కర్ అని కొనియాడారు.రాజ్యాంగం ద్వారానే మనకు స్వేచ్ఛ, స్వాతంత్రం, సమానత్వం, మానవ హక్కులు లభించాయని పేర్కొన్నారు. అంబేద్కర్ కొందరి వాడు కాదని, తాను అందరివాడినని చెప్పిన మహనీయుడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని వివిధ సేవా రంగాల్లో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు తమ వంతుసేవలందిస్తున్నటువంటి వారికి అలాగే కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన మహిళా మణులకు, తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన దళిత, గిరిజన కుల సంఘు నాయకులకు, భారతీయ జనతా పార్టీ వారి సేవలను గుర్తించి శాలువా కప్పి సన్మానం చేయడం జరిగిందిని వివరించారు.ఈ కార్యక్రమంలో జాటోత్ వెంకన్న,

చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొనగంటి రాజు, జనరల్ సెక్రెటరీ రతన్లాల్, సీనియర్ బిజెపి నాయకులు బడే రమేష్, తుంపురు శివ, మాజీ చుంచుపల్లి మండల అధ్యక్షులు రాయుడు నాగేశ్వరరావు, గుమలాపురం సత్యనారాయణ, బిజెపి మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రీ, స్వాతి, వివిధ మండలాల నాయకులు, మండలాధ్యక్షులు, న్యాయవాదులు, దళిత గిరిజన సంఘు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జై చంద్రన్నా.. జై జై చంద్రన్నా..



- నరసరావుపేటలో ఘనంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు..
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సంభరాలు

**పల్నాడు జిల్లా : పెన్ సత్తా** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా నరసరావుపేటలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో సోమవారం ఆయన కార్యాలయంలో ఈ సంబరాలు ఘనంగా జరిగాయి.

పార్టీ శ్రేణులు, కార్యకర్తలు మరియు అభిమానుల కోలాహలం మధ్య ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, చర్చ్ లలో, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం, దూరదృష్టి మరియు అవిరామ కృషి గురించి ఘనంగా వర్ణించారు. మా ప్రియతమ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఒక అసాధారణ నాయకుడు కాదు. ఆయన దూరదృష్టి, అధునాతన ఆలోచనలు, నిరంతర కృషి వల్లే రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. సాంకేతికత, ఇన్నోవేషన్, పరిశ్రమలు, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు వంటి ప్రతి రంగంలోనూ ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్ర చరిత్రలో మైలురాళ్లుగా నిలుస్తాయన్నారు.

నేటి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల సాధికారత, గ్రామీణ అభివృద్ధి, నగరాల అభివృద్ధి వంటి ప్రతి ప్రాధాన్యతను సమానంగా చూస్తూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదగాలనేది మా అందరి కల అని అన్నారు. ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో, అజేయ స్ఫూర్తితో వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లు అధిగమించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నానన్నారు. ఆయనకు మా అందరి నుంచి జేజేలు అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఘనంగా ప్రకటించారు.

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సమాజ సేవా దృక్పథంతో ఎమ్మెల్యే స్వయంగా పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ చేసి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి జేజేలు పలికారు.

చంద్రబాబు జన్మదినం సందర్భంగా నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డు లోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 9వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కటింగ్ చేశారు.

అదేవిధంగా వెంగళరెడ్డి నగర్ 8వ వార్డులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కటింగ్ జరిపారు. నరసరావుపేట స్టేషన్ రోడ్డు లోని మేరీకర్ట్ మెమోరియల్ సెంటినరీ టౌన్ బాప్టిస్ట్ చర్చిలో కూడా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ విధంగా వివిధ మతాల ఆలయాలు, చర్చి, మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించి, ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలు కోరుకున్నారు.

ఈ జన్మదిన వేడుకలు నరసరావుపేట నియోజకవర్గంలో ఎంతో ఉత్సాహం గా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పాల్గొన్నవారు వ్యక్తం చేశారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి కి 103 దరఖాస్తులు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెన్ సత్తా** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టరు (103) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టరు అన్నారు.అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణికి 48 ఫిర్యాదులు... వెంటనే పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు..



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 20, పెన్ సత్తా** :ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల స్పందన కొనసాగుతోంది. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినిపిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. శాఖల వారీగా చూస్తే రెవెన్యూ శాఖకు చెందినవి 8, ఇతర శాఖలకు సంబంధించినవి 40 దరఖాస్తులు వచ్చి మొత్తం 48 ఫిర్యాదులు నమోదయ్యాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా కేంద్రాల ప్రారంభంలో ఆలస్యం ఉండకూడదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి..



**రంగారెడ్డి జిల్లా, పెన్ సత్తా** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సంక్షేమ విద్యా సంస్థల పరిస్థితులపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) కె. శ్రీనివాస్ చిల్కూరులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి, అక్కడి వసతులు, విద్యార్థుల పరిస్థితిని పరిశీలించారు. అదే కార్యక్రమంలో భాగంగా ఎస్సీ అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జె. రామారావు హయత్ నగర్ లోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థినుల వసతి, ఆహార ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఇక 'సంక్షేమ విద్యా సంస్థలలో వంటగది, పారిశుధ్య డ్రైవ్' తొలి రోజు కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించింది. ప్రతి హాస్టల్‌కు నియమించిన ప్రత్యేక అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వంటగదులు, భోజనశాలలు, హాస్టల్ ప్రాంగణాల పరిశుభ్రతను తనిఖీ చేయడంతో పాటు పాత్రలు, నిల్వ ప్రదేశాలను శుభ్రపరిచారు. ఆహార నాణ్యత, నిల్వ విధానాలను పరిశీలించి, సిబ్బంది, విద్యార్థులకు పరిశుభ్రత, సురక్షిత వంటపై అవగాహన కల్పించారు. అదనంగా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు కీలకమని అధికారులు పేర్కొన్నారు.

# యుద్ధ - వాణిజ్య చర్చల పైనే దృష్టి

**కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలూ కీలకం**
**ముడి చమురు ధరలనూ గమనించాలి**




ఇరాన్‌తో సంప్రదింపులకు తమ ప్రతినిధులు సోమవారం పాకిస్థాన్‌లో ఉంటారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వాణిజ్య ఒప్పందం కోసం 3 రోజుల చర్చలకు అదేరోజున భారత ప్రతినిధులు అమెరికాలో ఉంటారు. ఈ రెండు సమావేశాల నుంచి వెలువడే సంకేతాలు భారత ఈక్విటీ మార్కెట్లకు దారిచూపుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్-అమెరికాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం 22న ముగియనుంది. దేశీయంగా చూస్తే కార్పొరేట్ సంస్థల మార్చి త్రైమాసిక ఫలితాలనూ మదుపర్లు గమనిస్తారు. ముడి చమురు ధరలు, విదేశీ మదుపర్ల ధోరణీ కీలకమే. నిఫ్టీ-50 సూచీకి 24,000-23,800 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చు. నిరోధం 24,700-24,800 పాయింట్ల వద్ద ఎదురు కావొచ్చని అంచనా. 23,800 కిందకు వస్తే మాత్రం 23,550-23,500 దిశగా సూచీ డీలాపడొచ్చన్నది సాంకేతిక నిపుణుల అంచనా. శనివారం వెలువడిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాల ప్రభావమూ ఉండొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..వాహన షేర్లు రాణించొచ్చు. ముడిచమురు ధర అంతర్జాతీయంగా తగ్గడం కలిసి రావచ్చు. ప్రయాణికుల వాహన తయారీ సంస్థల కంటే ద్విచక్ర, వాణిజ్య వాహన కంపెనీలపై విశ్లేషకులు అధిక విశ్వాసంతో ఉన్నారు.స్వల్పకాలంలో ఐటీ కంపెనీల షేర్లపై విశ్లేషకులు సానుకూలంగానే ఉన్నారు. కంపెనీల భవిష్యత్తు ఆదాయ అంచనాల ప్రభావం కొంత ఉండొచ్చు. హెచ్‌సీఎల్ టెక్, టాటా ఎలెక్సీ (మంగళవారం), టెక్ మహీంద్రా (బుధ), ఇన్ఫోసిస్ (గురు) ఫలితాల సందర్భంగా యాజమాన్య వ్యాఖ్యలను గమనించాలి.ఆరు వారాల నష్టాల అనంతరం ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు వరుసగా మూడో వారమూ లాభాలు కొనసాగించొచ్చు. ఈ రంగ సూచీ రాబోయే వారాల్లో 50,600-51,000 పాయింట్ల స్థాయిని పరీక్షించొచ్చు. టెలికాం షేర్లు స్వల్పకాలంలో సానుకూలంగా ఉండొచ్చు.. టారిఫ్ పెంపు, ప్రీమియమైజేషన్ కారణంగా సగటున ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం (ఆర్పు) రాణిస్తుండడం ఇందుకు నేపథ్యం. వచ్చే 4-5 ఏళ్ల పాటు ఏటా ఆర్పు 10% పెరగొచ్చనేది అంచనా. చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు పెరగొచ్చు. ఇటీవల ముడిచమురు ధరలు తగ్గుతుండడం వల్ల, ఈ కంపెనీలపై ఒత్తిడి తగ్గనుంది. చెన్నై పెట్రోలియం కార్ప్ శుక్రవారం ఫలితాలను వెల్లడించనుంది.హార్మూజ్ జల సంధిలో రవాణా ప్రారంభమైతే, యంత్రపరికరాల కంపెనీల అధిక వ్యయాలు తగ్గే అవకాశం ఉంది. మార్చి త్రైమాసిక ఫలితాల నుంచీ ఈ రంగ షేర్లు సంకేతాలు అందుకోవచ్చు. సిమెంటు షేర్లు రాణించొచ్చు. ఏప్రిల్-జూన్‌లో గిరాకీ స్థిరంగా ఉంటుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. అయితే 2026-27 మొత్తం మీద కంపెనీల నిర్వహణ మార్జిన్లు 150-200 బేసిస్ పాయింట్లు తగ్గొచ్చన్న అంచనాలున్నాయి. ఇంధన ధరలు పెరగడం దీనికి కారణం.లోహ కంపెనీల షేర్లు, ముఖ్యంగా గనుల కార్యకలాపాల్లో ఉన్న సంస్థలు సానుకూలంగా కదలాడొచ్చు. హార్మూజ్ పరిణామాలను సమీక్షించాల్సి ఉంది. సమీప కాలంలో ఈ రంగ సూచీ 13,500-14,000ను పరీక్షించొచ్చని అంచనా.ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణిలో చలించొచ్చు. త్రైమాసిక ఫలితాలు స్తబ్దుగా వెలువడవచ్చున్న అంచనాలున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగ్తి, రక్షణాత్మక రంగమైన ఫార్మాపై మదుపర్ల దృష్టి పడొచ్చుహెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్ ఫలితాల ఆధారంగా నిఫ్టీ బ్యాంక్ కదలాడొచ్చు. యుద్ధం ముందు స్థాయి (60,529)కి ఈ సూచీ వెళ్లొచ్చన్న అంచనాలున్నాయి. 56,000- 55,800 తక్షణ మద్దతు స్థాయిగా ఉంది.

# ట్రస్టీల అర్హత నిబంధనల్లో మార్పులు

**బాయ్ హీరాబాయ్ ట్రస్ట్ మొగ్గు**
**టాటా ట్రస్ట్స్ వెల్లడి**




దిల్లీ: బాయ్ హీరాబాయ్ ట్రస్ట్‌లో, ట్రస్టీలుగా ఉండటానికి ఉన్న అర్హత నిబంధనల్లో మార్పులు చేయాలని ఆ ట్రస్ట్ సభ్యులు నిర్ణయించినట్లు టాటా ట్రస్ట్స్ ఆదివారం వెల్లడించింది. పార్సీ-జొరాస్ట్రియన్ కాని వారు ట్రస్టీలుగా ఉండకూడదనే నిబంధన తొలగించేందుకు సరైన అథారిటీ ముందు విచారణ ప్రక్రియ నిర్వహించాలని వారు నిర్ణయించారు. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్‌కు టాటా ట్రస్ట్స్ మాజీ ట్రస్టీ మెహ్లీ మిస్త్రీ ఫిర్యాదు చేసిన కొన్ని రోజుల్లోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. బాయ్ హీరాబాయ్ ట్రస్ట్ బోర్డులో ప్రముఖ పారిశ్రామికవేత్త వేణు శ్రీనివాసన్, మాజీ రక్షణ కార్యదర్శి విజయ్ సింగ్‌లను నియమించడాన్ని మిస్త్రీ సవాల్ చేశారు. ట్రస్ట్ డీడ్ ప్రకారం, ట్రస్టీలు తప్పనిసరిగా పార్సీ-జొరాస్ట్రియన్ మతాన్ని అనుసరించేవారై ఉండాలని, ముంబయిలో నివాసితులై ఉండాలని ఫిర్యాదులో మెహ్లీ పేర్కొన్నారు. ఈ అభ్యంతరాల నేపథ్యంలో వేణు శ్రీనివాసన్ ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు. తాజా నిర్ణయానికి కారణాలివే..2026 ఏప్రిల్ 17న టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ ఎన్ టాటా అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాయ్ హీరాబాయ్ ట్రస్ట్‌కు చెందిన బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు పాల్గొన్నారు. ట్రస్ట్ డీడ్‌లోని కొన్ని నిబంధనలు టాటా గ్రూప్ సెక్యులర్, ఇన్‌క్లూజివ్ విలువలకు విరుద్ధంగా ఉన్నాయని ట్రస్టీలు భావిస్తున్నారు. దీంతో మతపరమైన ఆంక్షలను విధించే క్లాజ్‌లను సవరించడానికి తగిన అథారిటీని ఆశ్రయించాలని నిర్ణయించారు. 1916లో సర్ రతన్ టాటా (ఈయన 1918లో మరణించారు) రాసిన వీలునామాలో ఎటువంటి మతపరమైన ఆంక్షలు లేవని, అయితే 1923లో రూపొందించిన ట్రస్ట్ డీడ్‌లో మాత్రం పార్సీ-జొరాస్ట్రియన్ కాని వారు ట్రస్టీలుగా ఉండకూడదని చేర్చారని టాటా ట్రస్ట్స్ స్పష్టం చేసింది. 2000 సంవత్సరం నుంచి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన న్యాయ సలహా మేరకు పార్సీలు కాని వారిని కూడా నిరంతరం ట్రస్టీలుగా నియమిస్తున్నామని పేర్కొంది. మెహ్లీ వర్గం ఏమంటోందంటే..తాజా పరిణామాలపై స్పందించేందుకు మెహ్లీ మిస్త్రీ నిరాకరించారు. అయితే నిబంధనల సవరణకు మొగ్గు చూపడం అంటేనే.. ప్రస్తుతం ఆ డీడ్‌లో అటువంటి ఆంక్షలు ఉన్నాయని ఒప్పుకోవడమేనని మెహ్లీ మిస్త్రీ వర్గం పేర్కొంది. 103 ఏళ్ల తర్వాత వీలునామాను లేదా డీడ్‌ను సవరించడం సాధ్యమేనా అనేది ఇప్పుడు న్యాయాధికారులు తేల్చాల్సి ఉంటుందన్నారు. నిబంధనల సవరణ పూర్తయ్యే వరకు పార్సీలు కాని వారు ట్రస్టీలుగా ఉండటం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తున్నారు.
ఇటీవలి సమావేశంలోనే టాటా ట్రస్ట్స్ సీఈఓ సిద్ధార్థ్ శర్మ పరిపాలన, నాయకత్వంపై బోర్డు పూర్తి విశ్వాసాన్ని ప్రకటించింది. మెహ్లీ మిస్త్రీ అభ్యంతరాల నేపథ్యంలో వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్‌ను రాజీనామా చేయమని సిద్ధార్థ్ కోరారనే వార్తల మధ్య ఈ మద్దతు లభించడం గమనార్హం. బాయ్ హీరాబాయ్ ట్రస్ట్ అతి తక్కువ ఆస్తులు, పరిమిత కార్యకలాపాలు కలిగిన సంస్థని, అయినప్పటికీ దాని నిబంధనలను ఆధునిక విలువలకు అనుగుణంగా మార్చడమే తమ లక్ష్యమని టాటా ట్రస్ట్స్ వివరించింది.

# రిఫండ్‌లు ప్రారంభించిన ట్రంప్ సర్కార్



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ అక్కడి సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో సుంకాల తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా కస్టమ్స్ బోర్డర్ ప్రొటెక్షన్ ఇందుకోసం ఆన్‌లైన్ సిస్టమ్‌ను తీసుకొచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటల నుంచి దిగుమతిదారులు, వారి బ్రోకర్లు క్లెయిమ్‌లను సబ్మిట్ చేయొచ్చు. అమెరికా చరిత్రలో ఇది అతిపెద్ద రిఫండ్ ప్రక్రియగా నిలవనుంది.గతేడాది ట్రంప్ వివిధ దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, 1977 నాటి అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఈ సుంకాలను విధించడం రాజ్యాంగ విరుద్ధమని ఈ ఏడాది ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పునిచ్చింది. పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టంచేసింది. సుంకాలు చెల్లుబాటు కాకపోవడంతో
ఆ మొత్తం రిఫండ్ చేయాలని కోర్టు ఆదేశించింది. ?16,500కే మాతా వైష్ణోదేవి, మథుర, హరిద్వార్, రిషికేశ్ సందర్శనఈ సుంకాలను చెల్లించిన వ్యాపార సంస్థలు, దిగుమతిదారులు ఈ రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రంప్ వెలువరించిన ఉత్తర్వుల అనంతరం 3.30 లక్షల మంది దిగుమతిదారులు దాదాపు 166 బిలియన్ డాలర్లను సుంకాల రూపంలో చెల్లించారు. ఇందులో 56,497 మంది దిగుమతిదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి వడ్డీతో కలిపి సుమారు 127 బిలియన్ డాలర్లు ప్రస్తుతం వాపసు ఇవ్వడానికి ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. క్లెయిమ్ ఆమోదం పొందిన తర్వాత సుమారు 60 నుంచి 90 రోజుల్లో డబ్బు తిరిగి రానుంది. సాంకేతిక సమస్యల వల్ల కొంత ఆలస్యం జరగొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల చెల్లించిన సుంకాలను ముందుగా వాపస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే తొలుత చెల్లించిన వారికి ఆలస్యం కానుంది. దిగుమతిదారులు తాము పొందిన రిఫండ్‌ను వినియోగదారులకు పంచాల్సిన అవసరం లేదు. అయితే, ఫెడ్ఎక్స్ వంటి కొన్ని సంస్థలు మాత్రం తమ కస్టమర్లకు ఈ ప్రయోజనాన్ని బదిలీ చేస్తామని వెల్లడించడం గమనార్హం.

## రూ.34,200 కోట్ల ఎల్‌పీజీ దిగుమతి తగ్గించొచ్చు
## 20% డీఎంఈ కలిపితే
### ఈవై-పార్థెనాన్, న్యూఎరా నివేదిక




దిల్లీ: బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా ఉత్పత్తి చేస్తున్న డైమిథైల్ ఈథర్ (డీఎంఈ)ను వంటగ్యాస్ (ఎల్‌పీజీ)లో 20% కలపడం ద్వారా.. ఏటా దాదాపు 6.3 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ దిగుమతులను తగ్గించొచ్చని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. దీని వల్ల ఏటా 4.04 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.34,200 కోట్లు) విదేశీ మారకపు ద్రవ్యం ఆదా అవుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా మన దేశానికి ఎల్‌పీజీ సరఫరాల్లో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నివేదిక ప్రాధాన్యత సంతరించుకుంది. 'కోల్ గ్యాసిఫికేషన్ ఫర్ ఎనర్జీ అండ్ కెమికల్ సెక్యూరిటీ' పేరిట ఈవై-పార్థెనాన్, న్యూఎరా క్లీన్‌టెక్ సొల్యూషన్ ఈ నివేదికను వెలువరించాయి.
బొగ్గు గ్యాసిఫికేషన్, సహజవాయువు నుంచి హైడ్రోజన్‌ను విడదీసే, బయోమాస్ గ్యాసిఫికేషన్ ప్రక్రియల్లో స్వచ్ఛ ఇంధనమైన డీఎంఈని ఉత్పత్తి చేస్తారు. దిగుమతి చేసుకునే ఎల్‌పీజీకి ఇది ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది.బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఇప్పటికే ఎల్‌పీజీలో 20% వరకు డీఎంఈ కలపడానికి అనుమతి ఇస్తూ ప్రమాణాలను నోటిఫై చేసింది. సంప్రదాయ హైడ్రోకార్బన్ ఇంధనాలతో పోలిస్తే డీఎంఈ మండటం వల్ల వెలువడే ఉద్గారాలు చాలా తక్కువగా ఉంటాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా డీఎంఈ ఉత్పత్తిలో చైనా దాదాపు 90% వాటాను కలిగి ఉంది. అక్కడ బొగ్గు నుంచి రసాయనాల తయారీ పరిశ్రమ పెద్ద ఎత్తున విస్తరించడమే ఇందుకు కారణం.

## బ్యాంక్‌లకు లాభాల పంట..
## హెచ్‌డిఎఫ్‌సీ తుది డివిడెండ్ రూ.13




న్యూఢిల్లీ: ప్రయివేటు రంగంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లు మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో మొండి బాకీలకు కేటాయింపులు తగ్గించుకోవడం ద్వారా అధిక లాభాలను నమోదు చేశాయి. దిగ్గజ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గడిచిన క్యూ4లో 9 శాతం వృద్ధితో రూ.19,221 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయం రూ.33,082 కోట్లుగా నమోదయ్యింది. మొండి బాకీల కోసం చేసే కేటాయింపులు 18 శాతం తగ్గడం మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయి. ఈ సందర్భంగా ఇన్వెస్టర్లకు ప్రతి షేర్‌పై రూ.13 తుది డివిడెండ్ ను సిఫార్సు చేయగా ఈ ఏడాదికి మొత్తం డివిడెండ్ రూ.15.50కి చేరింది.

# హైదరాబాద్‌లో యమహా 'మెగా మైలేజ్ ఛాలెంజ్' విద్యుత్ భద్రతా పరికరాలు



హైదరాబాద్ : ఇండియా యమహా మోటార్ ప్రైవేట్ లిమిటెడ్, FZ-S Fi హైబ్రిడ్ మోటార్ సైకిల్‌తో పాటు 125cc Fi హైబ్రిడ్ స్కూటర్లు---ఫాసినో ఖీఱ మరియు ఘ్గ= 125 ఖీఱ కోసం హైదరాబాద్‌లో 'మెగా మైలేజ్ ఛాలెంజ్'ను నిర్వహించింది. స్మార్ట్ మోటార్ జనరేటర్ వ్యవస్థతో కూడిన హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఆకట్టుకునే ఇంధన సామర్థ్యం మరియు దాని ప్రయోజనాలపై వినియోగదారుల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. అగ్రశ్రేణి యమహా బ్లూ స్క్వేర్ డీలర్షిప్‌ల సహకారంతో నిర్వహించిన ఈ ఛాలెంజ్‌లో, యమహా కస్టమర్లు మరియు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొంటారని కంపెనీ వెల్లడించింది.
స్మార్ట్ మోటార్ జనరేటర్ మరియు స్టాప్ ట స్టార్ట్ సిస్టమ్ ఇంధన సామర్థ్యాన్ని గరిష్ఠం చేయడంతో పాటు, ఉద్గారాలను కూడా తగ్గిస్తాయి. ఈ వ్యవస్థలు నిశ్శబ్దమైన స్టార్ట్‌లను, ఉత్తేజకరమైన త్వరణం కోసం ఎలక్ట్రిక్-సహాయక టార్క్‌ను, మరియు నిశ్చలంగా ఉన్నప్పుడు ఇంజిన్ షట్‌డౌన్‌ను నిర్ధారిస్తూ, అంతిమంగా ఇంధనాన్ని ఆదా చేస్తాయి. ఈ హైబ్రిడ్ ఆవిష్కరణ, రైడర్‌లు ఖర్చు ఆదాతో మరియు తగ్గిన పర్యావరణ పాదముద్రతో సుదీర్ఘ ప్రయాణాలను ఆస్వాదించడానికి వీలు కల్పిస్తుంది. అందువల్ల, అధిక పనితీరు మరియు సామర్థ్యాన్ని కోరుకునే పర్యావరణ స్పృహ ఉన్న రైడర్‌లకు ఇది ఒక ఆదర్శవంతమైన ఎంపిక.ఈ ఛాలెంజ్‌ను ప్రారంభించేందుకు, యమహా మోటార్‌సైకిళ్లు మరియు స్కూటర్లకు ఇంధనం నింపి, హైదరాబాద్‌లోని నరేన్ గార్డెన్స్ కన్వెన్షన్ సెంటర్ నుండి బయలుదేరి తిరిగి అదే ప్రదేశానికి వచ్చేలా ఒక ప్రత్యేక మార్గంలో (మోటార్‌సైకిళ్లకు 65 కిలోమీటర్లు మరియు స్కూటర్లకు 35 కిలోమీటర్లు) పంపించారు. ఈ మార్గంలో నగర రోడ్లు, పట్టణ ట్రాఫిక్ మరియు విశాలమైన బహిరంగ ప్రదేశాలతో సహా వివిధ రకాల రైడింగ్ పరిస్థితులు ఉన్నాయి. ఇది పాల్గొనేవారికి బైక్ యొక్క సస్పెన్షన్, విన్యాస సామర్థ్యం, బ్రేకింగ్, యాక్సిలరేషన్ మరియు ప్రారంభ పికప్‌ను ప్రత్యక్షంగా అంచనా వేసే అవకాశాన్ని కల్పించింది. రైడ్ పూర్తి చేసి వేదికకు తిరిగి వచ్చిన తర్వాత, బైక్‌లలో వాటి అసలు స్థాయికి ఇంధనం నింపి, మైలేజీని లెక్కించడానికి ఇంధన వినియోగాన్ని నమోదు చేశారు.

# ఎడిటోరియల్

## పాలనా యంత్రాంగానికి వెన్నెముకలు పౌర సేవలు

జాతీయ పౌర సేవల దినోత్సవం ఏప్రిల్ 21న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు.

భారత పౌర సేవలు, (సివిల్ సర్వీసెస్) అంటే ప్రభుత్వ అధికా రులు దేశానికి, ప్రజలకు చేసే సేవలు. భారత పరిపాలనా వ్యవస్థ లో ఈ “భారత పౌర సేవలు” అతిముఖ్య రంగం. భారతీయ పార్లమెంటరీ ప్రజాతంత్ర వ్యవస్థలో పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిం చే గురుతర బాధ్యత ఈ రంగానిది. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రతినిధులు ప్రభుత్వంలో ఉంటూ మంత్రులుగా వ్యవహరిస్తారు. అలా కొద్ది మంది ప్రజా ప్రతినిధులు పరిపాలన సాగించడం సాధ్యం కాని విషయం. సేవారంగంలో గల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే బాధ్యతను పౌర సేవల అధికారు లు నిర్వర్తిస్తారు. ప్రభుత్వ ప్రతినిధులుగా శాసన కర్తలుగా, మంత్రులు పాలసీలను తయారు చేస్తే, సేవారంగం వాటిని అమలు పరుస్తుంది.పౌర సేవల వ్యవస్థ పరిపాలన యంత్రాంగానికి వెన్నుముక లాంటిది. ఇది రిపబ్లిక్ ఆఫ్ ఇండియా శాశ్వత కార్యనిర్వాహక శాఖ. ప్రభుత్వం రూపొందించిన విధానాలను, పథకాలను క్షేత్ర స్థాయిలో విజయ వంతంగా అమలు జరిపే బాధ్యత పౌర సేవకులదే. పౌర సేవల విభాగాలు మూడుగా విభజింప బడ్డాయి. ఇవి రాజ్యాంగ అధికారాలచే ఏర్పాటు చేయబడ్డాయి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) లతోపాటు సెంట్రల్ గ్రూప్ ఏ అండ్ గ్రూప్ బీ తదితర సర్వీసులు. ప్రస్తుతం అమలులో వున్న భారత పౌరసేవా రంగం (ఇండియన్ సివిల్ సర్వీసెస్) పూర్వ బ్రిటీషు ఇండియా భారత ప్రజా సేవ విధానాలపై ఆధారపడి భారత విభజన జరిగిన 1947 తరువాత నుండి అమలులోకి వచ్చింది.ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, తద్వారా ప్రజలు వారివారి ప్రాథమిక హక్కులను పొందేలా చూడాలన్న ఉద్దేశ్యంతో జాతీయ పౌర సేవల సంస్థ 2016, ఏప్రిల్ 21 ఈ పౌర సేవల దినోత్సవాన్ని ప్రారంభించింది. పౌర సేవల అధికారుల పనుల కార్యక్రమాలను ప్రోత్సహిం చేందుకు, ప్రశంసిం చేందుకు పౌర సేవలం దినోత్సవాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు.

బ్రిటిష్ కాలంలోనే పౌర సేవలు అనే పదం పుట్టింది. వారన్ హెస్టింగ్స్, చార్లెస్ కార్న్ వాలిస్, ఈ సేవలకు పునాదులు వేశారు. బ్రిటిష్ రాజ్ నుంచి పూర్తిగా స్వేచ్ఛ విముక్తులైన తర్వాత అడ్మినిస్ట్రేటివ్ విధానాన్ని పరిపాలనా విభాగం చూసు కునేది. భారతీయుల పౌర సేవల స్థానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులను తీసుకొచ్చారు.బ్రిటిష్ పాలనలో ఉన్న ఇండియన్ సివిల్ సర్వీస్ భారత స్వతంత్ర ప్రతిపత్తి అనంతరం ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ గా మారింది. ఏప్రిల్ 21, 1947న స్వదేశీ పార్లమెంటు సభ్యుడు సర్దార్ వ్లభాయ్ పటేల్ అఖిల భారత సేవలను ప్రారంభిం చారు. 1947లో ఢిల్లీలోని మెట్‌కాల్ఫ్ హౌస్‌లో స్వతంత్ర భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్ల ప్రొబేషనర్లను ఉద్దేశించి ప్రసంగించిన రోజు జ్ఞాపకా ర్థం ఈ తేదీని ఎంచుకున్నారు. అతను సివిల్ సర్వెంట్లను స్టీల్ ఫ్రేం (ఉక్కు చట్రం) ఆఫ్ ఇండియాగా పేర్కొన్నాడు. అటువంటి మొదటి కార్యక్రమం 21 ఏప్రిల్ 2006న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. పౌర సేవల అధికారులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, పబ్లిక్ రంగ సంస్థలలో పట్టున్న, వ్యూహాత్మక స్థానాలున్నవారు. ఈ అధికారులు ప్రభుత్వ విధానాలను అమలు పరచి పర్యవేక్షిస్తారు. ప్రభుత్వం వారు చేపట్టే పనులకు, విధానాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉన్నతమైన సేవలందిం చిన వ్యక్తులకు బృందాలను పురస్కారాలను ప్రదానం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన చాలా నుంది. అధికారులకు వారి అసాధారణమైన సేవలకు గుర్తింపుగా ప్రధాన మంత్రి పురస్కారాన్ని ఇస్తారు. అత్యుత్తమ సేవలను అందించిన వారికి “ప్రధాన మంత్రి “అవార్డును ఇస్తారు.

పౌర సేవల విషయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటానికి భవిష్యత్తులో ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలోనన్న అంశంపై పౌర సేవల ఉద్యోగులకు శిక్షణా కార్యాక్రమాలు నిర్వహించ బడుతాయి. పౌర సేవల గురించి, పౌరుల హక్కుల గురించి గ్రామస్థాయిలో గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కలిపిస్తారు.విశ్వవిద్యాలయ పట్టభద్రులు, పైబడి విద్యగల వారిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యు.పి.ఎస్.సి) ఒక ప్రత్యేక పరీక్షా విధానం ద్వారా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహించి అర్హత పొందినవారిని ఆయా సేవా రంగాలలో నియమిస్తారు.ముఖ్యమైన కార్యక్రమాలకు వినూత్న ఆవిష్కరణలకు చెందిన కేటగిరీలలో పురస్కారాలను ఇస్తుంటారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ కౌసబ్ యోజన, నమామి గంగే యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్, డిజిటల్ చెల్లింపుల వంటి కీలక కార్యక్రమాల అమలు ప్రాతి పదికన అవార్డుల ప్రదానం చేస్తారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నవీన భారతానికి ఎంతో కీలకంగా ఉంటున్నాయి. నూతన భారత కలలను సాకారం చేసేందుకు ఈ అవార్డులను ప్రోత్సాహకంగా అందిస్తున్నారు.

# ఎక్సర్‌సైజ్ చేసినా బెల్లీ ఫ్యాట్ తగ్గట్లేదా



బెల్లీ ఫ్యాట్ చూడ్డానికి చిన్న ప్రాబ్లమ్‌లానే కనిపించే పెద్ద ప్రాబ్లమ్. దీనిని తగ్గించుకునేందుకు ఎక్కువగా ఎక్సర్‌సైజెస్, డైట్స్, ఇంటి చిట్కాలు ఫాలో అవుతుంటారు. అయినప్పటికీ త్వరగా రిజల్ట్ కనిపించదు. దీంతో నా బాడీ టైప్ ఇంత అని సరిపెట్టేసుకుంటారు. కానీ, అలా కాకుండా అసలు ఏం మిస్టేక్స్ చేస్తున్నామో గమనించాలి. ఎంత ట్రై చేసినా పొట్ట తగ్గట్లేదంటే కొన్ని తప్పులే కారణమని చెబుతున్నారు హోమియోపతి డాక్టర్ చందన. ఆమె ప్రకారం కొన్ని తప్పుల్ని అవాయిడ్ చేస్తే చాలా వరకూ బెల్లీ ఫ్యాట్ తగ్గుతారట. మరి తప్పులేంటో చూడండి. బెల్లీ తగ్గాలంటే తినడం తగ్గించాలనుకోవడం సరికాదు. ముఖ్యంగా, రోజులో ముఖ్యమైన మీల్ బ్రేక్‌ఫాస్ట్‌ని అసలే స్కిప్ చేయొద్దు. ఇది ఎందుకు ముఖ్యమైన మీల్ అంటే రాత్రంతా దాదాపు 8 నుంచి 10 గంటల పాటు ఫాస్టింగ్ ఉన్న కడుపుకి బ్రేక్‌ఫాస్ట్ అనేది ఎనర్జీని ఇస్తుంది. దీనిని స్కిప్ చేసినా, లేట్‌గా చేసినా కూడా బెల్లీ తగ్గదు. తనలోని ఫ్యాట్‌ని అలానే ఉంచేస్తుంది. పైగా నీరసం, కోరికలు పెరిగి ఇంకా ఎక్కువగా తినాలనుకుంటారు. ఈ కారణం చేత లంచ్ టైమ్‌లోపు ఎక్కువగా జంక్‌ఫుడ్ తింటారు. అలా కాకుండా, చక్కగా ఉదయాన్నే మంచి హెల్దీ ముఖ్యంగా ప్రోటీన్ రిచ్ బ్రేక్‌ఫాస్ట్ చేయండి. దీంతో చాలా వరకూ బాడీలోని ఫ్యాట్ కరుగుతుంది.

నీరు మంచిదే. కానీ, ఎప్పుడు తాగాలనేది తెలుసుకోవాలి. నీటిని మనం తినడానికి అరగంట ముందైనా, తర్వాతైనా తాగాలి. అంతేకానీ, తాగిన వెంటనే తినడం, తిన్న వెంటనే నీటిని తాగడం వంటివి చేయొద్దు. దీంతో జీర్ణ సమస్యలొస్తాయి. ఈ సమస్యలు ఉంటే ఆటోమేటిగ్గా గట్ ప్రాబ్లమ్స్ పెరిగి పొట్ట కూడా లావుగా కనిపిస్తుంది. కాబట్టి, అలా కాకుండా తిన్న తర్వాత గ్యాప్ ఇచ్చి నీటిని తీసుకోండి. కొంతమంది రోజంతా ఏదో ఒక ఫుడ్ తింటూనే ఉంటారు. అవి స్నాక్స్ అయినా, మరే ఫుడ్ అయినా అలా నోటిని ఆడిస్తూనే ఉంటారు. దీని వల్ల మీ గట్‌కి గ్యాప్ ఎక్కడ దొరుకుతుంది. ఎప్పుడైనా సరే కాసేపు కడుపుకి రెస్ట్ ఇవ్వండి. దీంతో చాలా వరకూ తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. హెల్దీగా ఉంటారు. అలా ఏది పడితే అది తినకుండా ఉండండి. బరువు, బెల్లీ తగ్గాలనుకున్నా, జీర్ణ సమస్యలు దూరమై గట్ హెల్త్ బాగుండాలన్నా, మంచి నిద్ర పట్టాలన్నా కూడా డిన్నర్‌ని ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. అలా కాకుండా రాత్రుళ్లు లేట్ అయ్యే కొద్దీ మనకి మనంగానే ప్రాబ్లమ్స్‌ని తెచ్చుకున్నవారవుతాం. కాబట్టి, లేట్ నైట్ డిన్నర్ కాకుండా కనీసం 8 గంటల్లోపైనా డిన్నర్ కంప్లీట్ అవ్వాలి. తినడానికి నిద్రపోవడానికి కనీసం గంటన్నర నుంచి 2 గంటల గ్యాప్ ఉండేలా చూసుకోండి. అదే విధంగా, నిద్ర కూడా చాలా ముఖ్యం. రోజంతా అలసిన శరీరానికి, మనసుకి నిద్ర అనేది మంచి రిలాక్సేషన్ లాంటిది. మంచి నిద్ర ఉంటే బాడీ అలసిపోదు. మనసు కూడా తేలిగ్గా ఉంటుంది. కాబట్టి, హ్యాపీగా నిద్రపోండి. మంచి నిద్ర అంటే గ్యాప్ లేకుండా కనీసం 7 గంటలైనా నిద్రపోవడం. ఆల్కహాల్ అలవాటు అకేషనల్లీ అయితే పర్లేదు. కానీ, రెగ్యులర్‌గా ఆల్కహాల్ తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యల దగ్గర్నుంచీ ఇతర సమస్యలు కూడా వస్తాయి. డీహైడ్రేట్ అవుతారు. నిద్ర సమస్యలొస్తాయి. ఇది మన శరీర పనితీరుని నెమ్మదిస్తుంది. కాబట్టి, ఎప్పుడు కూడా అలా చేయకండి. ఏదైనా పార్టీ ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. ఇలాంటి తప్పులన్నీ అవాయిడ్ చేసి మంచి డైట్, లైఫ్‌స్టైల్ ఫాలో అయితే చాలా వరకూ బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. అంతేకానీ, నా శరీరమే ఇంత కాస్తా తిన్నా బాడీ పెరుగుతుందనుకుని మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకోవద్దు.

# నిద్ర కరువైతే నీలివేణికి ముప్పే




నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిద్రలేమి. సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల కేవలం అలసట మాత్రమే కాదు, శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా మనం గాఢ నిద్రలో లేనప్పుడు శరీరంలో కార్టిసోల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలు అసాధారణంగా పెరుగుతాయి. ఈ హార్మోన్ హెచ్చుతగ్గులు నేరుగా మన జుట్టు ఆరోగ్యంపై పడి, ఊహించని విధంగా జుట్టు రాలడానికి దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో పెరిగిన కార్టిసోల్ ప్రభావం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడతాయి. సాధారణంగా జుట్టు కుదుళ్లకు అందాల్సిన రక్త ప్రసరణ ఈ హార్మోన్ వల్ల తగ్గిపోతుంది. దీనివల్ల కుదుళ్లకు అవసరమైన ఆక్సిజన్ మరియు పోషకాలు సరైన మోతాదులో అందవు. ఫలితంగా, బలంగా ఉండాల్సిన వెంట్రుకలు క్రమంగా బలహీనపడి, చిన్నపాటి ఒత్తిడికి కూడా రాలిపోయే స్థితికి చేరుకుంటాయి. అసంపూర్తి నిద్ర కేవలం జుట్టు రాలడానికే పరిమితం కాకుండా, తల చర్మం ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. నిద్ర సరిగ్గా లేనప్పుడు శరీరంలోని సహజ మరమ్మత్తు ప్రక్రియ ఆగిపోతుంది, దీనివల్ల తల చర్మం పొడిబారడం లేదా ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. చర్మం ఆరోగ్యంగా లేనప్పుడు కొత్త జుట్టు మొలవడం ఆగిపోవడమే కాకుండా, ఉన్న జుట్టు తన సహజ మెరుపును కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. అందుకే అందమైన మరియు ఒత్తైన జుట్టు కావాలనుకునే వారు కేవలం షాంపూలు, నూనెలపైనే కాకుండా సరైన నిద్రపై కూడా దృష్టి సారించాలి. ప్రతిరోజూ కనీసం 7 నుండి 8 గంటల గాఢ నిద్రను పొందడం వల్ల కార్టిసోల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా జుట్టు కుదుళ్లకు పోషణ అంది, జుట్టు రాలడం తగ్గి ఆరోగ్యంగా పెరుగుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి మాత్రమే మీ జుట్టును దీర్ఘకాలం పాటు సంరక్షించగలదు.

# పసుపు పాలు తాగుతున్నారా?



ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు. కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

# రక్తహీనతను తరిమి కొట్టే సజ్జల లడ్డూ



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. అందుకే ఆరోగ్యంగా ఉండాలి అంటే తప్పకుండా మంచి ఆహారం తీసుకోవాలి. అయితే ఈ మధ్యకాలంలో చాలా మంది రక్తహీనత, ఎముకల బలహీనతతో బాధపడుతున్నారు. అలాంటి వారు మంచి ఐరన్, ఫైబర్ ఉండే సజ్జల లడ్డు రోజుకు ఒకటి తిన్నారంటే, ఎలాంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. మరి దీనిని ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

కావాల్సిన పదార్థాలు : సజ్జలు అర కిలో, బెల్లం 500 గ్రాములు, నెయ్యి 10 టీస్పూన్స్, తెల్ల నువ్వులు, వేరుశనగలు 100 గ్రాములు, బాదం 75 గ్రాములు, ఎండు ద్రాక్ష 25 గ్రాములు, ఏలకుల పొడి వన్ టీ స్పూన్, శొంఠి పొడి పావు టీస్పూన్, ఉప్పు చిటికెడు.

తయారీ విధానం : ముందుగా స్టవ్ వెలిగించి, దానిపై పాన్ పెట్టుకొని సజ్జలను వేయించుకోవాలి. అవి వేగిన తర్వాత పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు సజ్జల పిండి రెడీ అయిపోయింది.


ఇప్పుడు మరో పాన్ తీసుకొని అందులో కొంచె నెయ్యి వేసి, తెల్ల నువ్వులు, వేరుశనగ పప్పులు, బాదం, ఎండు ద్రాక్ష వేసి దోరగా వేయించుకోవాలి. తర్వాత వీటిని పక్కన పెట్టి, అదే పాన్‌లో మరో టీ స్పూన్ నెయ్యి వేసి, మనం మిక్సీ పట్టుకున్న పిండిని దోర దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి.

ఇప్పుడు వేయించిన నువ్వులు, పల్లీలు, బాదం అన్నింటినీ మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఈ పొడిని పక్కన పెట్టుకొని, ఒక పెద్ద బౌల్ తీసి, అందులో మనం వేయించి పక్కన పెట్టుకున్న సజ్జల పిండిని, మిక్సీ పట్టిన వేరుశనగ, నువ్వుల మిశ్రమాన్ని వేసి, కొంచెం ఉప్పు వేసి, మంచిగా కలుపుకోవాలి.

ఇప్పుడు బెల్లం పాకం ప్రిపేర్ చేసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి, అందులో అర కప్పు నీళ్లు పోసి, అవి మరిగిన తర్వాత బెల్లం వేసి, పాకం వచ్చే వరకు మరిగించుకోవాలి. ద

పాకం వచ్చిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, కొంచెం చల్లారిన తర్వాత అందులో సజ్జల పిండిని వేసి మంచిగా ఉండలు లేకుండా కలుపుకోవాలి.దీని తర్వాత చేతికి నెయ్యిని రాసుకొని, సజ్జల పిండిని చిన్నగా లడ్డూల మాదిరి చుట్టుకోవాలి. అంతే ఆరోగ్యాన్ని ఇచ్చే టేస్టీ టేస్టీ సజ్జల లడ్డూలు రెడీ. మరి మీరు కూడా మీ ఇంటిలో ప్రిపేర్ చేయండి

# హ్యాట్రిక్‌పై సన్‌రైజర్స్ కన్ను




సొంతగడ్డపై వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్‌పై కన్నేసింది. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుంది. ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లాడిన సన్‌రైజర్స్.. 3 విజయాలతో 6 పాయింట్లు గెలుచుకుని పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఆ మూడు విజయాలు లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో సాధించినవే. 5 మ్యాచ్‌ల్లో మూడింట గెలిచిన దిల్లీ 6 పాయింట్లతో అయిదో స్థానంలో కొనసాగుతోంది. దిల్లీ సాధించిన మూడు విజయాలూ ఛేదనలోనే రావడం విశేషం. ఇక కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గైర్హాజరీలో సన్‌రైజర్స్ బౌలింగ్ మొదట్లో కాస్త బలహీనంగా అనిపించినా.. తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్, శివాంగ్ కుమార్ అవకాశాల్ని అందిపుచ్చుకుని జట్టులో కొత్త ఉత్సాహం తీసుకొచ్చారు. రాజస్థాన్ రాయల్స్‌పై ప్రఫుల్ అద్భుతమైన ప్రతిభ కనబరచగా.. చెన్నై సూపర్ కింగ్స్‌పై ఇషాన్ మలింగ గొప్ప ప్రదర్శనతో సన్‌రైజర్స్ ఖాతాలో వరుసగా రెండు విజయాలు చేరాయి. అయితే బ్యాటింగ్‌లో నిలకడ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్‌శర్మలతో పాటు తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ కిషన్ కలిసికట్టుగా రాణించలేకపోతున్నారు. దూకుడుగా ఆడే క్రమంలో వికెట్లు కోల్పోతుండటంతో మధ్య ఓవర్లలో హెన్రిచ్ క్లాసెన్‌పై భారం పడుతోంది. క్లాసెన్ తన సహజసిద్ధమైన విధ్వంసక శైలికి భిన్నంగా ఇన్నింగ్స్‌ను నిర్మించాల్సి రావడంతో స్కోరు వేగానికి అడ్డుకట్ట పడుతోంది. మరోవైపు దిల్లీ బ్యాటర్లు కేఎల్ రాహుల్, నిశాంక, స్టబ్స్, మిల్లర్ రాణిస్తున్నా.. బ్యాటింగ్ పిచ్‌లపై భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోతున్నారు. ఆరంభంలో అదరగొట్టిన యువ ఆటగాడు సమీర్ రిజ్వీ గత మూడు మ్యాచ్‌ల్లో రెండంకెల స్కోరు చేయలేకపోవడం జట్టును కలవరపెడుతోంది. బౌలింగ్‌లో ఎంగిడి, కెప్టెన్ అక్షర్ పటేల్ ఆకట్టుకుంటున్నా.. కుల్‌దీప్ యాదవ్ అంచనాల్ని అందుకోలేకపోతున్నాడు.

# ముంబయికి విజయ తిలకం

## తెలుగు కుర్రాడి సూపర్ సెంచరీ

## 4 ఓటముల తర్వాత ఎంఐకి గెలుపు



13 సీజన్ల తర్వాత ఈసారి ఐపీఎల్‌ను విజయంతో ఆరంభించింది ముంబయి ఇండియన్స్. కానీ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో పరాజయాలు చవిచూసింది. విజయానికి ముఖం వాచిపోయి, పట్టికలో అట్టడుగు స్థానంలో కొనసాగుతున్న సమయంలో గుజరాత్‌తో పోరు! పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో 14 ఓవర్లకు 103/4తో నిలిచిన సమయాన ముంబయికి మరో ఓటమి ఖాయమని అంతా ఒక నిర్ణయానికి వచ్చేశారు! కానీ అప్పుడు మొదలైంది తిలక్ తుపాన్! ఆ దెబ్బకు గుజరాత్ బౌలర్ల గణాంకాలు చెల్లాచెదురైపోయాయి. ముంబయి స్కోరు పట్టపగ్గాల్లేకుండా దూసుకెళ్లింది. తొలి 22 బంతుల్లో 19 పరుగులు చేసిన తిలక్.. ఇన్నింగ్స్ ముగిసేసరికి 45 బంతుల్లో ఏకంగా సెంచరీ కొట్టేశాడు. అనూహ్యంగా ప్రత్యర్థికి 200 లక్ష్యాన్ని నిలిపిన ముంబయి.. తర్వాత బంతితోనూ రాణించి ఘనవిజయాన్నందుకుంది.

ముంబయి ఇండియన్స్ ఐపీఎల్-19లో మళ్లీ గెలుపు బాట పట్టింది. సోమవారం ఆ జట్టు 99 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ (101 నాటౌట్; 45 బంతుల్లో 8x4, 7x6) సంచలన శతకంతో మొదట ముంబయి 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. నమన్ ధీర్ (45; 32 బంతుల్లో 6x4, 1x6) రాణించాడు. గుజరాత్ బౌలర్లలో రబాడ (3/33), సిరాజ్ (1/25) సత్తాచాటారు. అనంతరం అశ్వని కుమార్ (4/24), శాంట్నర్ (2/16), ఘజన్‌ఫర్ (2/17), బుమ్రా (1/15)ల ధాటికి టైటాన్స్ 15.5 ఓవర్లలో 100 పరుగులకే కుప్పకూలింది. 26 పరుగులు చేసిన సుందరే టాప్‌స్కోరర్.

కూల్చేశారు: ముంబయి అనుకున్న దానికంటే పెద్ద స్కోరే చేసినా, బుమ్రా సహా బౌలర్లందరూ తేలిపోతున్న నేపథ్యంలో బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న గుజరాత్‌ను ఛేదనలో ఏమాత్రం ఆపగలదో అనుకుంటే.. పాత రోజులను గుర్తుకు తెస్తూ ముంబయి బంతితో రెచ్చిపోయింది. ఈ సీజన్లో తొలిసారిగా బౌలింగ్ దాడిని తనే ఆరంభించిన బుమ్రా.. తొలి బంతికే వికెట్ పడగొట్టాడు. సాయిసుదర్శన్ బుమ్రా బంతిని డ్రైవ్ చేయబోయి పాయింట్‌లో దొరికిపోయాడు. ఈ శుభారంభం తర్వాత ముంబయి బౌలర్లు రెట్టించిన ఉత్సాహంతో బౌలింగ్ చేశారు. కెప్టెన్ హార్దిక్.. ప్రమాదకర బట్లర్ (5)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా, ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచే శుభ్‌మన్ గిల్ (14)ను 'ఇంపాక్ట్ ప్లేయర్' అశ్వని కుమార్ ఔట్ చేసి జీటీని కోలుకోలేని దెబ్బ తీశాడు. శాంట్నర్.. ఒకే ఓవర్లో సుందర్, ఫిలిప్స్‌లను ఔట్ చేయడంతో గుజరాత్‌కు భారీ ఓటమి తప్పదని తేలిపోయింది. అశ్వని కుమార్ ఇంకో మూడు వికెట్లతో మిడిలార్డర్ పనిపట్టగా.. ఘజన్‌ఫర్ రెండు వికెట్లతో తోకను తెంచి, గుజరాత్ కథ ముగించాడు.

తిలక్ అసాధారణంగా..: కొత్త ఓపెనర్ డానిష్ మాలేవర్ 2 పరుగులకే వెనుదిరిగాడు. గత మ్యాచ్ సెంచరీ హీరో డికాక్ (13) సైతం ఎంతోసేపు నిలవలేదు. పేలవ ప్రదర్శనను కొనసాగిస్తూ సూర్యకుమార్ యాదవ్ (15) సైతం మరోసారి తక్కువ స్కోరుకే ఔటైపోయాడు. అద్భుతమైన బంతులతో ఈ ముగ్గురినీ పెవిలియన్ చేర్చాడు కాగిసో రబాడ. పవర్ ప్లేలో ముంబయి స్కోరు 46/3. తర్వాత టాప్ ఆర్డర్లో కొంచెం మెరుగ్గా ఆడుతున్న నమన్‌ధీర్ నాలుగో వికెట్ రూపంలో ఔటైపోయాడు. 14 ఓవర్లకు ముంబయి స్కోరు 103/4. అప్పటికి తిలక్ వర్మ 22 బంతుల్లో 19 పరుగులు మాత్రమే చేశాడు. అందులో ఒక్క బౌండరీ కూడా లేదు. ఇన్నింగ్స్ గమనం ప్రకారం ముంబయి 160 పరుగులు చేస్తే గొప్ప అన్నట్లుంది పరిస్థితి. తిలక్ వర్మ ఆట చూస్తే తర్వాతి మ్యాచ్‌కు తుది జట్టులో అయినా ఉంటాడా అన్న అనుమానాలు కలిగాయి. కానీ తర్వాతి ఓవర్ నుంచిఅంతా మారిపోయింది. ఒక్కసారిగా పూనకం వచ్చినట్లు రెచ్చిపోయాడు తిలక్ వర్మ. అప్పటిదాకా పరుగులు చేయడానికి ఆపసోపాలు పడ్డ బ్యాటర్ ఇతనేనా అనిపించేలా గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడిపోయాడు తిలక్. ప్రసిద్ధ్ బౌలింగ్‌లో 6, 4, 4 బాదడంతో అతడి విధ్వంసం మొదలైంది. తర్వాత రషీద్ బౌలింగ్‌లోనూ సిక్స్, ఫోర్ కొట్టిన అతను.. అశోక్ శర్మ వేసిన 18వ ఓవర్లో విశ్వరూపమే చూపించాడు. వరుసగా 6, 4, 4, 6, 6తో ఆ ఓవర్లో 26 పరుగులు రాబట్టాడు. ప్రసిద్ధ్ వేసిన ఆఖరి ఓవర్లో 6, 4తో 90 మీదికి వచ్చిన తిలక్.. మూడో బంతికి సింగిల్ తీశాడు.



# ఒకరితోనే డేటింగ్ అతడితోనే పెళ్లి!



ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి వ్యక్తిగత జీవితంపై పూర్తి క్లారిటీతో ఉందా? అంటే అవుననే అనాలి. నేటి తరం యువత డేటింగ్ సంస్కృతిపై భిన్నమైన అభిప్రాయాలతో ఉన్నప్పటికీ కృతి మాత్రం పాత తరం విలువలకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పుకొచ్చింది. తాను ఎవరితోనైనా డేటింగ్ చేస్తే? అది కేవలం పెళ్లి కోసమే ఉంటుందని ఒకరితోనే ప్రేమ.. అతడితోనే జీవితం అనే సూత్రాన్ని తాను నమ్ముతానని వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు ఆమెలోని పరిణతిని, సంప్ర దాయాల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతున్నాయి. ప్రేమ , పెళ్లి విషయంలో కృతి శెట్టికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉన్నట్లు కనిపిస్తుందని ఆమె మాటలతో అర్థమవుతుంది. ప్రస్తుతానికి కృతిశెట్టి దృష్టి సినిమాలపైనే ఉందని మరో ఐదేళ్ల వరకు ప్రేమ లేదా పెళ్లి అనే ఆలోచనే తన దరిదాపుల్లోకి రాదని స్పష్టం చేసింది. ఐదేళ్ల తర్వాత మాత్రమే తన వ్యక్తిగత జీవితం గురించి ఒక నిర్ణయం తీసుకుంటానని అప్పటి వరకు తన శక్తిని, సమయాన్ని నటనకే కేటాయిస్తానని పేర్కొంది. ప్రేమ అనేది ఒక బాధ్యత అని సరదా కోసం చేసే పని కాదని కృతి అభిప్రాయపడింది. తాను పెళ్లాడబోయే వ్యక్తి తనను అర్థం చేసుకునేవాడై, తన వృత్తిని గౌరవించే వాడై ఉండాలంది. డేటింగ్ పేరుతో సమయాన్ని వృధా చేయడం కంటే ఒకే వ్యక్తితో బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడమే ఉత్తమమని అమ్మడు నమ్ముతోంది. గ్లామర్ ప్రపంచంలో ఉంటూ ఇంతటి స్థిరమైన ఆలోచనలు కలిగి ఉండటం విశేషం. కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి స్పష్టత ఉండటం వల్ల వృత్తిపరంగా ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉంది. చాలామంది నటీమణులు కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు రూమర్ల బారిన పడుతుంటారు. అయితే కృతి శెట్టి ముందే ఇలాంటి ప్రకటన చేయడం ద్వారా అనవసరమైన గాసిప్స్‌కు చెక్ పెట్టినట్లయింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లోనూ అవకాశాలు దక్కించుకుంటున్న మంగళూరు భామ నటనతో ప్రేక్షకులను మెప్పించడమే పరమావధిగా భావిస్తుంది.కృతి శెట్టి కెరీర్ పై ఉన్న స్పష్టతతో ఇటు నిర్మాతలకు, అటు అభిమానులకు ఒకరకమైన భరోసా ఇచ్చినట్లే. ఐదేళ్ల పాటు కేవలం వెండితెరపైనే కనిపిస్తానని చెప్పడం ఆమె అంకితభావాన్ని సూచిస్తోంది. దీంతో నిర్మాతలు నిశ్చింతగా సినిమాలు చేసుకోవచ్చు. కృతి శెట్టి ఫాలోవర్స్ అమ్మడి కోస ప్రయత్నాలు చేయొచ్చు. ఈ బ్యూటీ నటించిన ఎల్ ఐ కె సినిమా కొన్ని గంటల క్రితమే రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయంపై అమ్మడు చాలా ఆశలే పెట్టుకుంది. అలాగే తెలుగులోనూ ఓ అగ్ర హీరో ప్రాజెక్ట్ కు సైన్ చేసింది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com